Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 186 విశాఖపట్నం, 6 మే 2025 మంగళవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.5.00

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు,
నిడదవోలు,
దేవరపల్లి మండలాలకు
విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 9100986584, 9553574250



## సింహాచలం దుర్ఘటనపై ప్రభుత్వానికి నివేదిక

**అమరావతి:** సింహాచలం గోడ దుర్ఘటనపై ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి అందజేసింది. ప్రాథమిక నివేదికను కమిషన్ ఛైర్మన్ సురేశ్‌కుమార్ సీఎం చంద్రబాబుకు అందించారు. "తాత్కాలికంగా కట్టిన గోడకు పునాది కూడా లేదు. భారీ వర్షం వల్ల పెద్ద ఎత్తున నీరు, బురద చేరి గోడ కూలింది. గోడ దిగువకు నీరు వెళ్లేందుకు లీప్ హోల్స్ కూడా లేవు. చందనోత్సవానికి వారం ముందు హడావిడిగా గోడ నిర్మించారు. ప్రసాద్ పథకంలో భాగంగా గోడకు అనుమతి ఇచ్చారు. డిజైన్, పునాది లేకుండానే గోడను కట్టేశారు. గోడ సామర్థ్యం, ... (మిగతా 2లో)

## అంతర్జాతీయ నిపుణుల బృందం

# పోలవరం సందర్శన



**పోలవరం, విశాఖ సమాచారం:** పోలవరం ప్రాజెక్టును అంతర్జాతీయ నిపుణుల బృందం సోమవారం సందర్శించింది. ఇక్కడ జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. ఈ బృందం తగు సూచనలు, సలహాలను జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఇవ్వనుంది. అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొన్నెల్లి, సీన్ హించ్ బెర్జర్, జియాన్ఫ్రాన్కో డి సికో, డేవిడ్ బి పాల్ ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. వీరితో పాటు పీపీఏ సభ్య కార్యదర్శి ఎం.రఘురాం, కేంద్ర జలసంఘం అధికారులు, సరబ్జిత్ సింగ్ భక్షి, రాకేశ్, అశ్వనీకుమార్ వర్మ, గౌరవ్ తివారీ, హేమంత్ గౌతమ్, సీఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా, లలిత్ కుమార్ సోలంకి పనులు జరుగుతున్న తీరుపై సమీక్షించారు. ప్రాజెక్టు సీఈ కె.నరసింహమూర్తి, ఎంఈఐఎల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు పనుల పురోగతిని వారికి వివరించారు. నిపుణుల బృందం సభ్యులు డయాఫ్రం వాల్ పనులు, ఎగువ కాఫర్ డ్యామ్ పటిష్ఠతపై ఆరా తీశారు.

### కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ

కృష్ణా నది యాజమాన్య బోర్డుకు ఏపీ ప్రభుత్వం లేఖ రాసింది. ఇవాళ్టి త్రిసభ్య కమిటీ సమావేశానికి హాజరు కాలేమని అందులో పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు నిపుణులు వస్తున్నారని అందులో వివరించింది. ఈ నెల 10 తర్వాత త్రిసభ్య కమిటీ భేటీ ఏర్పాటు చేయాలని ఏపీ ఈఎన్‌సీ కోరారు. ఇకపై కృష్ణా బోర్డు సమావేశాలు విజయవాడలోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.



## ఉపాధి అవకాశాలే లక్ష్యం

- ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థతో ఏపీ ఒప్పందం

**అమరావతి, విశాఖ సమాచారం:** ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎన్ఏసీ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.

పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా ప్రపంచస్థాయి ప్రమాణాలతో 9వేల మంది యువతకు శిక్షణ ఇస్తారు. శిక్షణా పరికరాలు, వినియోగ వస్తువులు, డిజిటల్ సామగ్రి కోసం ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ సుమారు రూ.5 కోట్లు ఖర్చుచేయనుంది. మంగళగిరిలో రూ.15 కోట్లతో ఎలక్ట్రిక్ సెంటర్ ఏర్పాటుకు ష్నైడర్ అంగీకారం తెలిపింది. అంతేకాకుండా అనంతపురంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ష్నైడర్ ఎలక్ట్రిక్ మోడ్రన్ పవర్ ఆప్టిమైజేషన్ పైలట్ ప్రాజెక్టు చేపట్టనుంది. మరోవైపు అడ్వాన్స్‌డ్ కోర్సుల్లో శిక్షణ కోసం ఒరాకిల్‌తో ... (మిగతా 2లో)

## వినతులు పునరావృతమైతే చర్యలు



### అధికారులకు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ హెచ్చరిక

### ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 225 అర్జీలు

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్' లో వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన అర్జీదారుల సమస్యలు విన్నారు. వారి వినతులు స్వీకరించి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేసి శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీ ఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, వినతులు ... (మిగతా 2లో)

## ఏపీలో వర్షం బీభత్సం..





### పది మంది మృతి

### అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశం

**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీలో గత కొన్ని రోజుల నుంచి వాతావరణంలో భిన్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలో రెండు రోజుల నుంచి రాష్ట్రంలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలకు చెట్లు నేలకొరిగాయి. చెట్టు కొమ్మలు ఇళ్లపై పడటంతో పలువురు గాయపడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిరది. రోడ్లన్నీ జనసంద్రాన్ని తలపించాయి. ఆదివారం తిరుపతి, బాపట్ల, ప్రకాశం, ఏలూరు, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షం బీభత్సం సృష్టించింది. తిరుపతి నలుగురు, బాపట్లలో ఇద్దరు, ప్రకాశంలో ఇద్దరు,, ఏలూరు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు ప్రాణాలు కోల్పోయినట్లు సోమవారం అధికారులు వెల్లడిరచారు. వీరిలో పిడుగుపాటుకు 8మంది మరణించినట్లు సమాచారం. చెట్లుకూలి ఒకరు, ... (మిగతా 2లో)

## మెటర్నిటీ లీవ్ 180 రోజులకు పెంపు

### ఇద్దరు పిల్లలకే ప్రసూతి సెలవు నిబంధన తొలగింపు



**అమరావతి, విశాఖ సమాచారం:** మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. మాతృత్వ సెలవులను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం 120 రోజులు మెటర్నిటీ సెలవులు ఇస్తున్నారు. వాటిని 180 రోజులకి పెంచుతూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. గతంలో ఇద్దరు పిల్లలకు మాత్రమే ప్రసూతి సెలవులు వర్తించేవి. తాజా జీవోలో ఆ నిబంధన కూడా తీసేసింది. ఎంతమంది పిల్లలను కన్నా యతావిధిగా సెలవులు వర్తిస్తాయని పేర్కొంది. తక్షణమే ఈ ఆదేశాలు అమలులోకి వస్తాయని స్పష్టం చేసింది.




## సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించండి

### రాష్ట్రాలకు కేంద్రం సూచన

**ఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడితో భారత్- పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం కొనసాగుతున్న వేళ భద్రతా సన్నద్ధతపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. దేశ భద్రతలో పౌరుల్ని సమాయత్తం చేసేందుకు బుధవారం (మే 7న) మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కొన్ని రాష్ట్రాలకు కేంద్ర ...(మిగతా 2లో)

## వక్ఫ్ చట్టంపై 'సుప్రీం'లో పిటిషన్లు : సీజేఐ కీలక నిర్ణయం



**ఢిల్లీ:** వక్ఫ్ (సవరణ) చట్టం-2025 రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. వక్ఫ్ చట్ట సవరణను సవాల్ చేస్తూ దాఖలైన 72 పిటిషన్లపై విచారణను తదుపరి సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బీఆర్ గవాయి సారథ్యంలోని ధర్మాసనం చేపడుతుందని స్పష్టం చేసింది. అనంతరం తదుపరి విచారణను మే 15కు వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. ఈ వ్యవహారంపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు సుదీర్ఘమైన విచారణ అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా మే 13న పదవీ విరమణ ...(మిగతా 2లో)




## విశాఖ-విజయవాడ విమాన సర్వీసు జూన్ 1నుంచి పునఃప్రారంభం

**ఢిల్లీ/ విశాఖపట్నం :** విశాఖ - విజయవాడకు ఉదయం పూట విమాన సర్వీసు వచ్చే నెల 1 నుంచి పున: ప్రారంభం కానున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలియజేశారు. విజయవాడలో ఉదయం 7.15 గంటలకు బయలుదేరి విశాఖకు ఉదయం 8.25 గంటలకు చేరుకుంటుంది. మళ్లీ విశాఖపట్నంలో ఉదయం 8.45 గంటలకు బయలుదేరి 9.50 విజయవాడకు చేరుకుంటుంది. కాగా విశాఖపట్నం - విజయవాడ మధ్య ఇండిగో మార్నింగ్ ఫ్లైట్ సర్వీస్ పునఃప్రారంభం కావడం పట్ల విశాఖ ఎంపీ శ్రీ భరత్ సంతోషం వ్యక్తం చేశారు. గత నెలలో ఈ సర్వీసు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో సత్వరమే స్పందించి ...(మిగతా 2లో)

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

## మంత్రి కొలుసు పార్థసారథి



**అమరావతి:** పింఛను పంపిణీలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఏపీ సమాచారశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను అందించే బాధ్యత అధికారులదేనని చెప్పారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పంపిణీలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అకాల వర్షాలు, పంట నష్టంపై సీఎం సమీక్ష నిర్వహించారని, కొన్ని చోట్ల ధాన్యం తడిసినట్లు కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. "రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏ రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేస్తుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది"అని పార్థసారథి తెలిపారు.

# అనుమానితుల పిటిషన్లపై సుప్రీంలో విచారణ

## ఏపీ మద్యం కుంభకోణం



**దిల్లీ:** ఏపీ మద్యం కుంభకోణంలో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ముగ్గురు అనుమానితులు సుప్రీంకోర్టు లో దాఖలు చేసిన పిటిషన్లపై నేడు విచారణ జరిగింది. మాజీ సీఎం జగన్ కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతీ సిమెంట్స్ పూర్తి కాలపు డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో నేడు విచారణ చేపట్టిన జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం.. హైకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉన్నందున ఎలాంటి మధ్యంతర ఆదేశాలు ఇవ్వలేమని స్పష్టం చేసింది. అరెస్ట్ చేయకుండా ఉండేందుకు స్టే ఇవ్వాలని ఆ ముగ్గురి తరఫు న్యాయవాదులు కోరగా ధర్మాసనం నిరాకరించింది. అరెస్ట్ చేయబోం అని రాష్ట్ర ప్రభుత్వం స్టేట్‌మెంట్ ఇవ్వాలని నిందితుల తరఫు న్యాయవాదులు కోరగా.. అలా ఇవ్వడం కుదరదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో స్పందించిన జస్టిస్ పార్థీవాలా.. తమ పరిధి, అధికారాల ప్రకారం నడుచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. ఎల్లుండి జరిగే విచారణలో ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనం హైకోర్టుకు సూచించింది. ఈ కేసుకు సంబంధించి మెరిట్స్‌పై ఎలాంటి కామెంట్స్ చేయడం లేదని.. నిర్ణయాధికారం హైకోర్టుదే అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టులో విచారణ ముగిసి ఆదేశాలు ఇచ్చిన తర్వాత తదుపరి విచారణ చేపడతామని తెలిపింది.

# వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి 30 ఏళ్లు వెనక్కి : మంత్రి కొల్లు రవీంద్ర



**సబ్బవరం, విశాఖ సమాచారం:** వైసీపీ పాలనలో ఏపీ అభివృద్ధి 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని రాష్ట్ర గనులు, భూగర్భ జలాలు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. అనకాపల్లి జిల్లా సబ్బవరంలోని జీఎస్ కళ్యాణమండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనిశ్చితి పరిస్థితుల నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు తెదేపా, జనసేన ఒక తాటి మీదకు వచ్చాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఆయన వివరించారు. పెందుర్తి నియోజక వర్గంలో తెదేపా కార్యకర్తల్లో నెలకొన్న అనిశ్చితిని గ్రహించానని, పొత్తుల్లో భాగంగా ఇక్కడ జనసేనకు సీటు ఇవ్వాల్సి వచ్చిందని చెప్పారు. ఇక్కడి తెదేపా కార్య కర్తలకు అన్యాయం జరగ కుండా చూసుకునే బాధ్యత తనదన్నారు. రాష్ట్రంలో జనసేన, భాజపా, ఎవరి పార్టీని వారు బలోపేతం చేసుకున్నందువల్ల మనం కూడా తెదేపాను బలోపేతం చేసుకోవలసిన ఆవశ్యకత ఉందని చెప్పారు.

# పాక్ నీళ్లకు ఎసరు

## రెండు డ్యామ్‌ల నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్న భారత్

**పహల్గాం :** పహల్గాం దాడికి ప్రతిగా భారత్ కఠిన చర్యలు చేపట్టింది. తాజాగా చీనాబ్ నదిపై రెండు డ్యామ్‌ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు పనులు చేపట్టినట్లు వార్తలొస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడికి భారత్ సైలెంట్‌గా ప్రతీకార చర్యలు మొదలుపెట్టింది. ఇప్పటికే బాగ్‌లిహార్ డ్యామ్ నీటిని ఆపేయగా.. తాజాగా సలాల్ డ్యామ్‌ను కూడా మూసివేసింది. అంతేకాదు.. ఈ రెండు హైడ్రోపవర్ ప్రాజెక్టుల రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన పనులు మొదలుపెట్టినట్లు ఓ ఆంగ్ల వార్తా సంస్థ కథనం వెలువరించింది. ఇప్పటికే సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. దీనికి సంబంధించిన సమాచారాన్ని పాక్‌కు వెల్లడించలేదు. తొలిసారి ఆ ఒప్పందానికి భిన్నంగా భారత్ తీసుకొన్న తొలి చర్యగా నిపుణులు చెబుతున్నారు. గత గురువారం నుంచి ఒక రిజర్వాయర్‌లో బురదను తొలగించేందుకు ఫ్లషింగ్ ప్రక్రియను మొదలుపెట్టింది. దాదాపు మూడు రోజులపాటు ఇది కొనసాగింది. ఈ పనులను ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పీసీ చూసుకొంటోంది. కాకపోతే పాక్‌కు ఇప్పటికిప్పుడు నీటి సరఫరా పూర్తిగా నిలిపివేయడం సాధ్యం కాకపోయినా.. భవిష్యత్తులో మాత్రం సమస్యలు ఎదురుకావచ్చని నిపుణులు చెబుతున్నారు. సింధు జలాల ఒప్పందం కిందకు వచ్చే నదులపై ఇలాంటివి దాదాపు అరడజను ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిల్లో నిల్వ సామర్థ్యం పెంచితే మాత్రం పాక్‌కు నీటి కరవు తప్పదు. సలాల డ్యామ్‌ను 1987లో .. బాగ్‌లిహార్‌ను 2009లో ప్రారంభించారు. ఈ డ్యామ్‌లపై మొదలైన పనుల గురించి, ప్రభుత్వం లేదా ఎన్‌హెచ్‌పీసీ స్పందించడం లేదు. ఇక బురదను, నీటిని బయటకు పంపే ఫ్లషింగ్ ప్రక్రియ కారణంగా విద్యుత్తును మరింత సమర్థవంతంగా ఉత్పత్తి చేసే అవకాశంతో పాటు.. టర్బైన్ దెబ్బతినకుండా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇక సింధూ జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో.. పాక్‌కు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం భారత్‌కు లేదు. మన ప్రాజెక్టుల్లో ఇష్టం వచ్చిన మార్పులు చేసుకోవచ్చని సెంట్రల్ వాటర్ కమిషన్ మాజీ అధిపతి కుష్వీందర్ వోహ్రా పేర్కొన్నారు.



# విశాఖ-విజయవాడ విమాన సర్వీసు జూన్ 1నుంచి పున:ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

పునరుద్ధరణకు కృషిచేసిన రామ్మోహన్ నాయుడుకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కనెక్టివిటీ వ్యాపార, పర్యాటక, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుందని పేర్కొన్నారు. విశాఖపట్నం నుండి ఇతర కీలక నగరాలకు కూడా ఎయిర్ కనెక్టివిటీని బలోపేతం చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

# వినతులు పునరావృతమైతే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 225 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ శాఖకు చెందినవి 81 ఉండగా, పోలీసు శాఖకు సంబంధించి 14, జీవీఎంసీ సంబంధించి 79 ఉన్నాయి. ఇతర విభాగాలకు సంబంధించి 51 వినతులు వచ్చాయి.

### పీజీఆర్ఎస్ నిర్వహణపై సమీక్ష

పీజీఆర్ఎస్ నిర్వహణ , స్వర్ణాంధ్ర లక్ష సాధన, పీ4 సర్వే, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సీఎంఓ కార్యాలయం, డిప్యూటీ సీఎంఓ కార్యాలయం, ఐటీ శాఖ నుంచి వచ్చే అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపడంలో జిల్లాస్థాయి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రతిరోజు అధికారులు శాఖాపరమైన సమీక్ష నిర్వహించి, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌లో వచ్చిన అర్జీల శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీ పునరావృతం అయ్యిందంటే జిల్లా అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సీఎంవో కార్యాలయం నుండి వచ్చిన దరఖాస్తులు పరిష్కరించిన అనంతరం రీ ఓపెన్ అయినట్లయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పరిష్కరించిన అర్జీదారుల వద్దకు వెళ్లి వారి ఫీడ్ బ్యాక్ సకరించి మొబైల్ యాప్ ఫీడ్ బ్యాక్ కలెక్షన్ రిపోర్ట్‌లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాగా, బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం గోడపత్రికను, అలాగే జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారు ఈనెల 31 వరకు నిర్వహించే సమ్మర్ కోచింగ్ క్యాంప్ నకు సంబంధించి గోడ పత్రికను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎమ్‌సి అడిషనల్ కమిషనర్ వర్మలతో కలిసి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆవిష్కరించారు.

# ఏపీలో వర్షం బీభత్సం..

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్‌ఘాతంలో మరొకరు మృతి చెందారు. ఈ సంఘటన గురించి సమాచారం తెలుసుకున్న సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్ష సూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాణనష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. పిడుగుల పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్‌లకు సందేశం వెళ్లని సమయంలో దగ్గరగా ఉన్నట్లైతే నేరుగా వెళ్లి అప్రమత్తం చేయాలని సూచించారు. పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలన్నారు. జిల్లాల్లో పరిస్థితులను బట్టి కిందిస్థాయి అధికారులతో కలెక్టర్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. మరో నాలుగైదు రోజులు ఏపీకి భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు సూచించారు. అవసరమైతే తప్ప బయటకు రావొద్దని హెచ్చరించారు.

# సివిల్ మాక్ డ్రిల్స్ నిర్వహించండి

(మొదటి పేజీ తరువాయి)

హెూంశాఖ సూచించింది. భద్రతా సన్నద్ధతపై పౌరులకు అవగాహన కల్పించాలని, అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో తెలపాలని పేర్కొంది. శత్రు దాడి జరిగినప్పుడు విద్యార్థులు, పౌరులు తమను తాము రక్షించుకొనేందుకు వీలుగా స్వీయ రక్షణపై అవగాహన కల్పించాలి తెలిపింది.

పాకిస్థాన్‌పై భారత్ ప్రతీకార దాడులు చేయొచ్చనే అంచనాలు నెలకొన్న తరుణంలో కేంద్ర హెూంశాఖ ఈ తరహా ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. పాక్ సైతం ప్రతిదాడికి దిగితే అందుకు ముందుగానే రాష్ట్రాలను సిద్ధం చేస్తున్నట్లు కనబడుతోంది. శత్రు దేశం దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సన్నద్ధతా కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొంది. ఎయిర్ రైడ్ హెచ్చరిక సైరెన్ల పనితీరును పరీక్షించాలని ఆదేశించింది. అత్యవసర సమయాల్లో ఎలా స్పందించాలో పౌరులకు తెలపాలని నిర్దేశించింది.

# వక్ఫ్ చట్టంపై 'సుప్రీం'లో పిటిషన్లు : సీజేఐ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

చేయనుండటంతో తదుపరి సీజేఐగా జస్టిస్ బీఆర్ గవాయి మే 14న బాధ్యతలు చేపట్టనున్నారు. వక్ఫ్ వ్యవహారంపై గతంలో చేపట్టిన విచారణ సమయంలో వాద ప్రతివాదనలను తమ ధర్మాసనం పరిశీలించిందని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. రిజిస్ట్రేషన్లపై కొన్ని అంశాలు లేవనెత్తారని, కొన్ని గణాంకాలు వివాదాస్పదంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అందువల్ల దీన్ని పరిష్కరించాల్సి ఉందని జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, కేవీ విశ్వనాథన్ ధర్మాసనం పేర్కొంది. మధ్యంతర దశలో ఉన్నా సరే.. తాను ఎలాంటి తీర్పు, ఉత్తర్వును రిజర్వు చేయదలచుకోలేదని సీజేఐ సంజీవ్ ఖన్నా ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ అంశంపై సహేతుకమైన రోజు విచారణ జరగాల్సి ఉందన్నారు. వక్ఫ్ అంశంపై పిటిషన్లను జస్టిస్ బీఆర్ గవాయి ధర్మాసనానికి పోస్టు చేస్తామని పేర్కొన్నారు.



# పహల్గాం ఉగ్రవాదులకు అడవుల్లో స్థావరాల నిర్మాణంలో శిక్షణ

**పహల్గాం :** పహల్గాం ఉగ్రదాడి విచారణంలో భాగంగా జమ్మూకశ్మీర్ జైళ్లలోని టెర్రరిస్టుల ఇంటరాగేషన్‌లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడిలో పాల్గొన్న వారికి పర్వత ప్రాంతాల్లో రహస్య స్థావరాల నిర్మాణంలో పాక్ ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తేలింది. అంతేకాదు.. రోజుల తరబడి అడవుల్లో నక్కి జీవించడం ఎలానో కూడా వీరికి నేర్పించారు. ఇటీవల అడవుల్లో బయటపడ్డ ఉగ్రస్థావరాలు, ఇతర దర్యాప్తుల విచారణల్లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ఈ ఉగ్రదాడిలో పాల్గొన్న హాషీమ్ మూసా పాక్ మాజీ పారా కమాండో అన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భద్రతా దళాలు బైసరన్ లోయ చుట్టూ ఉన్న మార్గాలను పూర్తిగా జల్లెడ పడుతున్నారు. ఇప్పటి వరకు భద్రతా దళాలు ఈ లోయ నుంచి మొదలయ్యే 54 మార్గాలను గుర్తించి తనిఖీలు చేపడుతున్నారు. ఇవన్నీ చిక్కటి అటవీ ప్రాంతం, పర్వతాల మీదుగా సాగుతాయి. ఉగ్రవాదులకు లాజిస్టిక్స్ సాయం చేసిన కొందరు ఓవర్ గ్రౌండ్ వర్కర్లను అదుపులోకి తీసుకొన్న దళాలు.. వారిని తీసుకొని ఈ మార్గాలను గాలిస్తున్నాయి.

# సింహాచలం దుర్ఘటనపై ప్రభుత్వానికి నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

భక్తుల భద్రత గురించి తనిఖీలు చేయలేదు. విశాఖ సీపీ, సాక్షుల నుంచి వాంగ్మూలాలు నమోదు చేశాం. దుర్ఘటనకు ఆలయ ఈవో, ఇంజినీరింగ్ సిబ్బంది, పర్యాటకశాఖ అధికారులు, గుత్తేదారులే బాధ్యులు. వారిపై తీవ్ర చర్యలు తీసుకోవాలి"అని కమిషన్ తమ నివేదకలో పేర్కొంది. విశాఖలోని సింహాచలం దేవస్థానంలో గత నెల 30న అప్పన్న స్వామి నిజరూప దర్శనం కోసం వేచిచూస్తున్న భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందిన విషయం తెలిసిందే. దానిపై రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిషన్‌ను నియమించింది.

# ఉపాధి అవకాశాలే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఒరాకిల్ మై లెర్న్ ప్లాట్‌ఫామ్ ద్వారా మూడేళ్లలో 4లక్షల మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈమేరకు మంత్రి లోకేశ్ సమక్షంలో ఒరాకిల్, ఏపీఎస్ఎస్‌డీసీ మధ్య ఎంవోయూ కుదిరింది.

# నల్లి ధర్మారావుకు చందు సాహితీ అవార్డు



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** చందు ట్రస్ట్ ప్రతియేటా సాహితీవేత్తలకు ఇస్తున్న ప్రతిష్టాత్మక సాహిత్యపురస్కారం 2025 సంవత్సరానికి గానూ ప్రముఖ రచయిత, కవి, సీనియర్ జర్న లిస్ట్ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితలసంఘం అధ్యక్ష వర్గ సభ్యులు, శ్రీకాకులంజిల్లా అరసం అధ్యక్షులు ఐన శ్రీ నల్లి ధర్మారావుకి అందించాలని చందుట్రస్ట్ కార్యవర్గం ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు చందు సాహితీ సాంస్కృతిక సంస్థ ఛైర్మన్ ఆచార్య కె యస్.చలం, కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఈ పురస్కారం ప్రజావాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు, ప్రఖ్యాత కవి పద్మశ్రీ కొలకులూరి ఇనాక్, ప్రజాకవి తెలంగాణ ఎమ్ ఎల్ సి , గోరటి వెంకన్న, ప్రస్తుత ఆదికవి నన్నయ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సాతుపాటి ప్రసన్నశ్రీ ప్రముఖసాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావుల వంటి ఎందరో ప్రముఖులు అందుకున్నారు. ఈనెల 18వ తేదీన విశాఖపట్నంలోని పౌరగ్రంథాలయంలో ఉదయం పదిగంటలకు జరిగే ఆచార్య చందుసుబ్బారావు లిటరరీ & కల్చరల్ ట్రస్ట్ వార్షికోత్సవసభలో నల్లిధర్మారావుకి ఈపుస్కారాన్ని అందజేస్తున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం.ఈ సందర్భంగా సన్మానం చేసి పదివేల రూపాయిలు , జ్ఞాపిక అతిథుల చేతులమీదుగా అందజేస్తామని తెలిపారు. ఈసభకు నగరంలోని సాహితీవేత్తలనూ, కళాకారులనూ సాదరంగా ఆహ్వానం పలుకుతున్నామన్నారు.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి

## బెట్టింగ్ చట్ట వ్యతిరేకమనే విషయాన్ని యువత గుర్తుంచుకోవాలి

## టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్

**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత సంక్షేమం కోసం 20 లక్షల ఉద్యోగాల కల్పించటమే లక్ష్యంగా పని చేస్తోందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ అన్నారు. గత 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డిఎస్‌సి, 6100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ, రూ.8.5 లక్షల కోట్లు పెట్టుబడులతో పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా 5 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏ పి పి ఎస్ సి ని నిర్వీర్యం చేసిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దానిని బలోపేతం చేసి నిరుద్యోగ యువతకు అండగా నిలబడేలా చర్యలు తీసుకుందని తెలిపారు.



యువత అనేది దేశానికి ఒక సంపద లాంటిది అని, యువత శక్తి సామర్థ్యాలు సమాజాభివృద్ధి కోసం ఉపయోగిస్తే ఎన్నో సంచలనాలు చేయవచ్చని అన్నారు. వైఎస్ఆర్సీపీ ప్రభుత్వ నిర్ణయాలతో యువత రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరాశ నిస్పృహ తో బెట్టింగ్, డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడి ఉజ్వలమైన భవిష్యత్తు ను అంధకారం చేసుకున్నారని పేర్కొన్నారు. సులభంగా అధిక డబ్బులు సంపాదించవచ్చని బెట్టింగ్ లోకి దిగటం, లోన్ యాప్స్ వంటి వాటిని ఆశ్రయించి మీ భవిష్యత్ ను అంధకారమయం చేసుకోవద్దని కోరారు. బెట్టింగ్ అనేది ఒక వ్యసనం, చట్ట వ్యతిరేకం అనే విషయాన్ని యువత గుర్తుంచుకోవాలని కోరారు. ప్రభుత్వం ఆపరేషన్ ఈగల్ కార్యక్రమం చేపట్టి గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతోందన్నారు. బెట్టింగ్ ను నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

2nd pages11.qxd 5/5/2025 9:08 PM Page 3



# అయినవిల్లికి భక్తుల తాకిడి



**అయినవిల్లి:** అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. స్వామికి మహానివేదన చేశారు. సాయంత్రం ఎనిమిది గంటలకు విశేష సేవలు చేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 44 మంది, లక్ష్మీగణపతి హోమంలో 17 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాల్లో నలుగురు దంపతులు పూజలు చేశారు. స్వామివారి గరిక పూజలో ఒక జంట పాల్గొంది. ఐదు జంటలు స్వామికి ఉండ్రాళ్ల పూజ చేశారు. స్వామి వారి సన్నిధిలో 13 మంది చిన్నారులకు అక్షరభ్యాసం, నలుగురికి తులాభారం, ఒకరికి నామకరణ, ఏడుగురు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. 37 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 2400 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాలు ద్వారా రూ.1,98,976 ఆదాయం లభించినట్లు ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

# గిరిజన విద్యార్థులకే అధికంగా సీట్లు కేటాయించాలి

**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో అందుబాటులో వున్న వివిధ కోర్సుల్లో గిరిజన విద్యార్థులకే అధికంగా విద్యావకాశాలు కల్పించాల్సి వుందని రాష్ట్ర షెడ్యూల్డు తెగల కమిషన్ ఛైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సంబంధిత చట్టంలో మార్పులు తెచ్చేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఎస్.టి.కమిషన్ తరపున గిరిజన విద్యార్థులకు మరింత అధికంగా సీట్లు కేటాయింపు జరిగేలా కేంద్రానికి ఒక లేఖ రాస్తామన్నారు. దీనితోపాటు ఇందులో నిర్వహిస్తున్నవివిధ కోర్సుల్లో ఈ ప్రాంత గిరిజన విద్యార్థులు అధికంగా చేరేలా అవగాహన కల్పించాల్సి వుందన్నారు. దీనికోసం విశ్వవిద్యాలయం అందిస్తున్న పలు కోర్సులపై గిరిజన ప్రాంతాల్లో విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు.

గిరిజన విశ్వవిద్యాలయంలో బోధన సిబ్బంది అవసరమైన సంఖ్యలో లేనందున అధ్యాపకులు, బోధన సిబ్బందిపై అధికభారం వుంటోందని గమనించామని, దీనిని నివారించేందుకు విశ్వవిద్యాలయ అవసరాలకు తగినట్టుగా అధ్యాపకులు, బోధన సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపట్టాల్సి వుందని కేంద్రానికి నివేదించనున్నట్టు చెప్పారు.

రాష్ట్ర ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ డా.డి.వి.జి.శంకరరావు సోమవారం నగరంలోని గాజులరేగ ప్రాంతంలో వున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వైస్ ఛాన్సలర్ ప్రొ.టి.వి.కట్టమణి, ఇతర అధికారులు, అధ్యాపకులతో భేటీ అయి విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కోర్సులు, గిరిజన విద్యార్థులకు కల్పిస్తున్న విద్యావకాశాలు, యీ ప్రాంతంలోని గిరిజనుల అభివృద్ధిలో యూనివర్శిటీ నిర్వహిస్తున్న పాత్రపై చర్చించారు.

విజయనగరంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థను ఏర్పాటు చేయడంలో కృషిచేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముందుగా ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ కృతజ్ఞతలు చెప్పారు. ఈ ప్రాంత గిరిజనుల కలల్ని సాకారం చేసే దిశగా ఏర్పాటైన ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థ ద్వారా గిరిజనులకు అధికంగా ప్రయోజనం చేకూరాల్సి వుందని, ఆ దిశగా గిరిజన విశ్వవిద్యాలయం రూపొం దాల్సి వుందన్నారు. ప్రస్తుతం వున్న వైస్ ఛాన్సలర్ ప్రొ.కట్టిమణి నేతృత్వంలో అధ్యాపకులు, సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేస్తూ యీ విశ్వవిద్యాలయ అభివృద్ధికోసం తపిస్తున్నారని పేర్కొన్నారు.

అనంతరం మెంటాడ మండలం కుంటినవలస వద్ద గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్ నిర్మాణం పనులను ఎస్.టి.కమిషన్ ఛైర్మన్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి పనుల పురోగతిని తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జాతీయ రహదారి నుంచి విశ్వవిద్యాలయ క్యాంపస్ చేరుకునేందుకు అనుసంధాన రోడ్డు నిర్మాణం పూర్తికావలసి వుందని యూనివర్శిటీ అధికారులు వివరించారు. భవన నిర్మాణాలు త్వరలోనే పూర్తవుతాయని భావిస్తున్నామని, వీలైనంత త్వరగా శాశ్వత క్యాంపస్‌కు యూనివర్శిటీ మార్పు చేసేందుకు ప్రయత్ని స్తున్నట్టు అధికారులు వివరించారు.

పనుల పరిశీలనలో ఆర్.డి.ఓ. రామ్మోహనరావు, యూనివర్శిటీ ఏ.ఓ. సూర్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు జెడ్పీ అతిథిగృహంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, విజయనగరం ఆర్.డి.ఓ. కీర్తి తదితరులు ఎస్.టి. కమిషన్ ఛైర్మన్‌ను కలసి గిరిజన విశ్వవిద్యాలయంలో వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు.

**ఈస్ట్ కోస్ట్ రైల్వే**
టెండరు ప్రకటన నెం. WAT-TRS-OT-03-2025-26
పని పేరు మరియు ప్రదేశం: ఎలక్ట్రిక్ లోకో షెడ్/విశాఖపట్నం ఆవరణము లందు CCTV సర్వైలెన్స్ సిస్టమ్ ఏర్పాటు యొక్క సప్లయి, ఇన్‌స్టలేషన్ మరియు కమీషనింగ్ చేయుట.
టెండరు విలువ: ₹ 10,83,922/-, బయానా: ₹ 21,700/-, పని పూర్తి చేయు కాలం: మూడు సంవత్సరాలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 23.05.2025న 1500 గంటలకు.
పూర్తి సమాచారం లభించు వెబ్‌సైట్: www.ireps.gov.in .
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీరు (TRS), విశాఖపట్నం
PR-92/Q/25-26

# 'నీట్'గా.. ప్రశాంతంగా



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి గాను నీట్ యూజీ-2025 పరీక్ష జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో 16 కేంద్రాల్లో 7 వేల మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాశారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ పరీక్ష కేంద్రానికి 480 మందిని కేటాయించగా 474 మంది పరీక్ష రాసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు చెప్పారు. గైస్‌లోని పరీక్ష కేంద్రానికి 480 మందిని కేటాయించగా 471 మంది పరీక్షకు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్, కాలేజీ ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ తెలిపారు. రెండు సెషన్స్‌లో జరిగిన ఈ పరీక్షను ఎన్‌టీఏ అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు ఈసారి సమగ్ర విధానాన్ని అనుసరించింది. కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఒక కేంద్రీకృత కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి.. జిల్లాలో క్షేత్రస్థాయిలో పరీక్షల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించారు. అయితే చెవిదిద్దులు, కాలి మెట్టెలు, చైన్లు వంటివి తొలగించిన తర్వా తే పరీక్ష కేంద్రంలోకి అడుగు పెట్టేలా కఠినంగా వ్యవహరించడంతో అమ్మాయిలు కాస్త ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరీక్ష పత్రం కఠినంగా ఉన్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. ఫిజిక్స్ చాలా కష్టతరంగా.. కెమిస్ట్రీ మధ్యస్థంగా.. బయాలజీ చాలా సులభంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు.

# నేటి నుంచి మిట్ట మధ్యాహ్నం నీడ మాయం

## జీరోషాడో గతంలో ఇలా





**రాజమహేంద్రవరం:** ఖగోళ అద్భుతం వల్ల సోమవారం నుంచి ఈ నెల 14వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాల పాటు మాయమవు తుందని ఇంటర్నేషనల్ ఆస్టరాయిడ్స్ సర్చ్ క్యాంపెయిన్ (ఐఏఎస్‌సీ) జాతీయ కన్వీనర్ మేకా సుసత్యరేఖ ఆదివారం తెలిపారు. ఈ పరిణామాన్ని జీరో షాడోగా వ్యవహరిస్తారని అన్నారు. సాధారణంగా నీడ మనిషికి ఏదో ఒకపక్క కనిపిస్తుందని, సోమవారం నుంచి 14 వరకు మాత్రం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యకాంతి మన మీద లంబంగా పడి నీడ మాయమవుతుందని ఆమె వివరించారు. "భూమి అక్షం 23.5 డిగ్రీలు వంపుగా ఉన్నందున సూర్యుడి చుట్టూ భ్రమణం చేసే సమయంలో సూర్యుని స్థానం ఉత్తర-దక్షిణ దిశల్లో మారుతూ ఉంటుంది. ఏటా రెండు సందర్భాల్లో కర్కాటక, మకరరేఖల మధ్య ఉన్న ప్రదేశాల్లో మధ్యాహ్నం సమయాల్లో సూర్యకిరణాలు భూమిపై సంపూర్ణ లంబంగా పడతాయి. దీనివల్ల నిలువు వస్తువుల నీడ రెండు నిమిషాల వరకు పూర్తిగా మాయమవుతుంది" అని సుసత్యరేఖ చెప్పారు. ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుని కదలిక, స్థానాన్ని అధ్యయనం చేసేందుకు జీరోషాడో ఎంతగానో ఉపకరిస్తుందని సుసత్యరేఖ తెలిపారు.

# శ్రీ నూకంబిక హుండీ ఆదాయం రూ.34.80 లక్షలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ప్రసిద్ధి చెందిన అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయాని కి భక్తులు హుండి ద్వారా తే 16-4-2025 ది నుండి నుండి 5-05-2025 ది వరకు మొత్తం 19రోజులలో సమర్పించిన ముడుపులు, మొక్కుబడులను సోమవారం నాడు శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానము ఉత్సవ మండపములో హుండీ లెక్కింపు జరిగింది. సదరు లెక్కింపులో నగదుగా రూ 34.80.099/- లు, బంగారం గ్రాములు 27,500 మిల్లీగ్రాములు , వెండి 601 గ్రాములు లభించిందిసదరు హుండీ లెక్కింపులో ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) ఆలయ సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ ధర్మకర్తలుసూరే సతీష్,దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్,మారిశెట్టి శంకర్రావు,కాండ్రేగుల రాజారావు,మజ్జి శ్రీనివాసరావు కొడుకుల శ్రీకాంత్,వడ్డాది మంగ,కోనేటిసూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి ,మరియు హుండీ పర్యవేక్షకులు టి సాంబశివరావు, కోటమి నాయకులు,అనకాపల్లి, పర్యవేక్షణలో లెక్కింపు జరిగినది. సదరు హుండీల లెక్కింపునకు దేవస్థానము సిబ్బంది, పూజారులు, శ్రీవారిసేవ సభ్యులతోను, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, గవరపాలెం బ్రాంచ్ సిబ్బంది, అనకాపల్లి టౌన్ పోలీసు వారు, భక్తులు పాల్గొన్నారు.

# ఆ నర్సులకూ నైట్ డ్యూటీలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** కేజీహెచ్‌లో కొన్నేళ్లుగా రాత్రి విధుల నుంచి తప్పించుకుంటున్న నర్సులకు ఎట్టకేలకు నైట్ డ్యూటీలు కేటాయించారు. కొన్నేళ్లుగా హెడ్ నర్స్ జెస్సీ ఈవెంజలీన్‌తో పాటు స్టాఫ్ నర్సులు నీలవేణి, ఎస్‌వై సత్యవతి, పాత్ర మోసెస్, ఎంవీ నాగమణి దేవి రాత్రి విధుల నుంచి ఏవేవో కారణాలు చూపుతూ తప్పించుకుంటున్నారు. వీరితో పాటు మరికొందరు ఈ జాబితాలో ఉన్నారు. ఈ కథనానికి స్పందించిన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆ మరుసటి రోజే నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు, హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులతో సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, రొటేషన్ ప్రకారం నైట్ డ్యూటీలు చేయాలని ఆ సమావేశంలో స్పష్టం చేశారు. ఇటీవల కేజీహెచ్‌ను సందర్శించిన అదనపు డీఎంఈ కూడా పలు ఆదేశాలిచ్చారు. వార్డుల్లో ఏ సమస్య ఉన్నా హెడ్ నర్సులదే బాధ్యత అని, బ్లాకుకు ఒక హెడ్ నర్సు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో హెడ్ నర్స్ జెస్సీ ఈవెంజలీన్‌తో పాటు స్టాఫ్ నర్సులు నీలవేణి, ఎస్‌వై సత్యవతి, పాత్ర మోసెస్, ఎంవీ నాగమణి దేవికి ప్రస్తుతం నైట్ డ్యూటీలు కేటాయించారు. డీఎంఈ ఆదేశాల మేరకు బ్లాకుకు ఒక హెడ్ నర్స్‌ను నియమించారు.

# రేపు జి.మాడుగుల మండల సమావేశం

**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారామరాజు జిల్లా జి మాడుగుల మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం 7 తేదీ బుధవారం నాడు మండల పరిధి సమావేశ మందిరం జరుగుతుందని ఎంపీడీవో దేవిడ్ రాజ్ తెలిపారు . ఈ సమావేశానికి ఎంపీపీ జడ్పిటిసి ఎంపీటీసీ సభ్యులు తో తో పాటు సర్పంచులు అన్ని శాఖల అధికారులు యధావిధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

# త్వరితగతిన పరిశ్రమలకు అనుమతులు

- విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తులకు ప్రోత్సాహం
- జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):-** పరిశ్రమల స్థాపనకోసం వచ్చే దరఖాస్తులను పరిశీలించి, నిర్ణీత కాలవ్యవధిలోగా అనుమతులను మంజూరు చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ ఆదేశించారు. జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టరేట్ సమావేశమందిరంలో సోమవారం జరిగింది. జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ, సింగిల్ విండోద్వారా గడువు లోపల అనుమతులను మంజూరు చేసి, పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. గత మూడు నెలలో పరిశ్రమల స్థాపనకు 149 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో ఇప్పటివరకు 138 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామని చెప్పారు. వీలైనంత వేగంగా మిగిలినవాటిని అనుమతించాలని చెప్పారు. అలాగే వీలైనంత వేగంగా రుణాలను మంజూరు చేయాలని బ్యాంకులకు సూచించారు. చేతివృత్తిదారులకు చేయూత నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం పిఎం విశ్వకర్మ యోజన పథకాన్ని అమలు చేస్తోందని, వీలైనంత వేగంగా రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బొబ్బిలి వీణల తయారీ లాంటి అరుదైన కళలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. పిఎం విశ్వకర్మ యోజనకు సుమారు 86,386 దరఖాస్తులు అందగా, మూడు దశల్లో వీటిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు కేవలం 1,080 మందికి మాత్రమే రుణాలు మంజూరు చేయడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే పునఃసమీక్షించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకోసం స్థలం దాదాపు 15 ఏళ్ల క్రితం స్థలం తీసుకొని, పరిశ్రమను స్థాపించకుండా మళ్లీ గడువు కోరడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి దరఖాస్తులను జాగ్రత్తగా పరిశీలించాలని, పరిశ్రమ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జిఎం శ్రీధర్, సహాయ సంచాలకులు బి.రామకృష్ణ, ఏపిఐఐసి జోనల్ మేనేజర్ మురళీ మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం ప్రారంభం
- విత్తన బంతులతో సామాజిక వనాలు పెంచాలి.
- మనం మన జీవరాశినీ కాపాడుకోవాలి.
- జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీం.





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** జీవవైవిధ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఎం విపి కాలనీలోని ఉషోదయ జంక్షన్ లో పర్యావరణ పరిరక్షణ మాసోత్సవం కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెలలో ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా దేశీయ పండ్ల విత్తనాలు సేకరించాలని కోరారు. ఆ విత్తనాలతో విత్తన బంతులు తయారు చేసి సామాజిక వనాలు పెంచాలని కోరారు. భూమి మీద సమస్త జీవరాశినీ కాపాడుకోవాలన్నారు. మనం మన నగరంలో పచ్చని చెట్లు పెంచడం కోసం ప్రతి ఒక్కరూ సహకరం అందించాలన్నారు.

ఈ నెలలో పర్యావరణ పరిరక్షణ కోసం పిచ్చుకలకు గూళ్ళు ఏర్పాటు చేయడం, పక్షులు ఇతర జీవులకు నీరు అందుబాటులో ఉంచడం, ధాన్యం కంకుల కుచ్చులు తయారు చేయడం, పక్షులకు కనిపించే విధంగా అందుబాటులో ఉంచడం, ఇళ్ల పైకప్పుల మీద కూరగాయలు ఆకుకూరలు పండ్లు పండించే వారికి విత్తనాలు అందజేయడం తదితర కార్యక్రమాలు నిర్వహించడం, పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్లు విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగుతుంది అన్నారు. విశాఖ మహానగరంలో విభిన్న ప్రాంతాల్లో నిర్వహించే ఈ పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొన దలచిన వారు, తమ దగ్గర ఈ కార్యక్రమాలు నిర్వహించాలని కోరే వారు 8333849955 కి తమ వివరాలను వాట్సాప్ చేయమని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారిణి పూర్వీరజాక్ ఉపాధ్యాయులు పి రాధాకృష్ణ, గ్రీన్ వాలంటీర్లు జె రాజేశ్వరి, ఐ కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# భీమిలి వివాహిత కేసు.. బయటపడ్డ సంచలన నిజాలు





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** భీమిలి మండలం దాకమర్రి వివాహిత హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు పాల్పడిన క్రాంతి కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం ఆరు బృందాలు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. కేసు వివరాలను విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చి మీడియాకు వెల్లడించారు. దాకమర్రి పంచాయతీ శివారు 26వ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఫార్చ్యూన్ హిల్స్ వుడా లేఅవుట్‌లో నిన్న(శుక్రవారం) ఉదయం సగం కాలిన మహిళ మృతదేహాన్ని భీమిలి పోలీసులు గుర్తించారు.

ఆ మహిళను హంతకులు గొంతు కోసి తరువాత పెట్రోల్‌తో దహనం చేసినట్టు గుర్తించారు. మెడలో కాలిన నల్లపూసల గొలుసు ఉండటంతో మృతురాలు వివాహితగా గుర్తించారు. ఆరు ప్రత్యేక బృందాలుగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈ కేసు మిస్టరీని ఛేదించారు. మృతురాలు వెంకటలక్ష్మికి క్రాంతి కుమార్‌తో అనే వ్యక్తికి అక్రమ సంబంధం ఉన్నట్లు పోలీసులు తేల్చారు.

క్రాంతి కుమార్‌కు ఇద్దరు భార్యలు ఉండగా, అతడు రెండో భార్యతో మృతురాలి ఇంటి పక్కన ఉండేవాడు. క్రాంతికుమార్, మృతురాలికి మధ్య స్నేహం కుదిరింది. అతనికి వెంకటలక్ష్మితో వివాహేతర సంబంధం ఏర్పడటంతో రెండో భార్యకు, వెంకటలక్ష్మికి మధ్య గొడవలు జరిగాయి. ఈ క్రమంలో రెండో భార్యను వేరే బ్లాక్‌కు మార్చాడు. అయినా వెంకటలక్ష్మితో వివాహేతర సంబంధం కొనసాగించాడు.

ఈ విషయంలో మొదటి భార్య, రెండో భార్యతో తరచు గొడవలు జరుగుతున్నాయి. మరో వైపు వెంకటలక్ష్మి.. తనతోనే ఎక్కువసేపు గడపాలని తనతోనే ఉండాలంటూ క్రాంతికుమార్‌పై ఒత్తిడి తీసుకొచ్చింది. దీంతో ఎలాగైన వెంకటలక్ష్మిని వదిలించుకోవాలని.. ప్లాన్ చేశాడు. వెంకటలక్ష్మిని బయటకు తీసుకెళ్లాడు. ఇద్దరు ఐస్‌క్రీమ్ తిన్నారు. అనంతరం బైక్‌లో పెట్రోల్ కొట్టించి.. బాటిల్లో కూడా కొట్టించాడు. ఇంటి వద్ద పెట్రోల్ దొంగలు ఉన్నారని.. అందుకే బాటిల్లో పెట్రోల్ కొట్టించానంటూ వెంకటలక్ష్మితో చెప్పాడు.

శారీరకంగా కలుద్దామని చెప్పి దాకమర్రి లేవట్‌కి తీసుకెళ్లి వెంకటలక్ష్మిని కత్తితో గొంతు కోసి చంపేశాడు. తరువాత ఆమె ఒంటిపై ఉన్న నగలు తీసుకుని.. తరువాత పెట్రోల్ పోసి తగలుపెట్టాడు. కేసు విచారణలో మొదట వెంకటలక్ష్మిని గుర్తించాము. తర్వాత కాంత్రితో వెళ్తున్నట్లు తన తల్లి చెప్పిందని కొడుకు పోలీసులకు చెప్పారు. ఆ కోణంలో విచారణ చేసిన పోలీసులు నిందితుడిని పట్టుకున్నారు.

# క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** క్రీడలకు విశాఖ నగరం ఎంతో అనుకూలమైనదని, క్రీడల అభివృద్ధికి జీవీఎంసీ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, క్రీడాకారులకు, క్రీడలకు తన సంపూర్ణ ప్రోత్సాహం అందిస్తానని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం పెందుర్తి లోని మేయర్ స్వగృహంలో విశాఖ నగరానికి చెందిన 13 సంవత్సరాల అంతర్జాతీయ క్రీడాకారిణి శ్రీ సాహితి రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించినందుకు మేయర్ ఆమెను అభినందించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ నగరం క్రీడలకు ఎంతో అనుకూలమైనదని ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో వారి ప్రతిభను చాటుకున్నారని అలాగే శ్రీసాహితి రోలర్ ఆర్టిస్టిక్ స్కేటింగ్ లో జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిందని కొనియాడారు. ఇంత ఘనత సాధించి ప్రతిభ కనబరిచిన శ్రీసాహితి కు తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని, జీవీఎంసీ తరపున సహాయ సహకారాలు క్రీడలకు అందిస్తానని,విద్యార్థులు నగరంలో ఉన్న క్రీడా సదుపాయాలను వినియోగించుకొని క్రీడల్లో రాణించి విశాఖ నగర కీర్తిని మరింత పెంచి నగరానికి ఘనతను సాధించి మంచి పేరు ప్రతిష్టలను తేవాలని తెలిపారు.

2nd pages11.qxd 5/5/2025 9:08 PM Page 4



విశాఖ సమాచారమ్

మంగళవారం 6-5-2025

## శాంతి కోసం ఎదురు చూపు

మణిపూర్ విధ్వంసానికి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్ల కాలం ఎన్నో విషాదకర సంఘటనలకు, మానవతా సంక్షోభానికి సాక్ష్యంగా నిలిచింది. రెండు తెగల మధ్య మతోన్మాద రాజకీయం సృష్టించిన విధ్వంసక క్రీడలో అమాయక ప్రజలు ఊచకోతకు గురైన మే 3వ తేదీ చరిత్రలో ఓ చేదు జ్ఞాపకం. ఒకప్పుడు ప్రశాంతంగా ఉండే ఈ రాష్ట్రం, ఇప్పుడు భయం, అభద్రతా భావంతో కొట్టుమిట్టాడుతోంది. తెగల మధ్య నెలకొన్న వైషమ్యాలతో ఎన్నో కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోగా, మరెన్నో జీవితాలు శాశ్వతంగా గాయపడ్డాయి. ఈ ఘర్షణ దాని సామాజిక నిర్మాణాన్ని విచ్ఛిన్నం చేసి, రాష్ట్రాన్ని దీర్ఘకాలిక మానవతా సంక్షోభంలోకి నెట్టివేసింది. గత రెండేళ్లలో ఏం జరిగిందో ఒకసారి గుర్తు చేసుకుంటే, ఈ అల్లర్ల వెనుకనున్న శక్తులెవరో అర్థమవుతుంది. మెయిటీ, కుకీ తెగల మధ్య మొదలైన ఘర్షణలు తారాస్థాయికి చేరాయి. ఇళ్లు, చర్చిలు, ఆస్తులు ధ్వంసమయ్యాయి, స్త్రీలపై అత్యాచారం జరిగింది. మహిళలు, పిల్లలు సైతం హింసకు గురయ్యారు. 70వేల మందికి పైగా ప్రజలు నిరాశ్రయులవ్వగా, 260మందికి పైగా మరణించారు. వందలాది ఇళ్లు, గ్రామాలు బూడిదయ్యాయి. నిరాశ్రయులైన ప్రజలు ఇప్పటికీ కొండలు, లోయలలోని సహాయ శిబిరాల్లో మగ్గుతున్నారు. వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. 'హింస ఎప్పుడూ పరిష్కారం కాదు, అది కేవలం విధ్వంసాన్ని మాత్రమే తెస్తుంది' అంటారు గాంధీజీ. ఈ హింస మణిపూర్‌లో కూడా విధ్వంసాన్నే సృష్టించింది. ఇప్పటికీ సాధారణ పరిస్థితులు నెలకొనలేదు.

రాష్ట్రంలోని రెండు ప్రధాన తెగల మధ్య పరస్పర అపనమ్మకం అనే అగాధం చాలా లోతుగా ఏర్పడింది. ఫలితంగా మణిపూర్ సమాజం తీవ్రంగా నష్టపోయింది. తరతరాలుగా కలిసి జీవించిన ప్రజల మధ్య అవిశ్వాసం పెరిగిపోయింది. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. విద్య, వైద్యం వంటి ముఖ్యమైన రంగాలు కుంటుబడ్డాయి. భవిష్యత్తు తరాల మీద ఈ హింస యొక్క ప్రభావం చాలా కాలం పాటు ఉంటుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఈ మొత్తం వ్యవహారాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఘోరంగా విఫలమైంది. అల్లర్లను నివారించడానికి అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాల్సిన ముఖ్యమంత్రి ఒక తెగకు ప్రతినిధిగా వ్యవహరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇప్పటికీ నిమ్మకునీరెత్తినట్లుగానే వుంది. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని మోడీ ఆ రాష్ట్రంవైపు కన్నెత్తి చూడకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దంపడుతోంది. ప్రతిపక్ష పార్టీలు, మానవహక్కుల సంస్థలు, సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ శాంతిని నెలకొల్పడానికి కేంద్రప్రభుత్వం ఇప్పటికీ చిత్తశుద్ధితో వ్యవహరించడంలేదన్నది సుస్పష్టం. ఆ రాష్ట్ర ప్రజలకన్నా తమ సొంత రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమన్నట్లుగా వారి వ్యవహారశైలి కనిపిస్తోంది. 'గతం నుండి నేర్చుకోని వారు దానిని పునరావృతం చేయడానికి ఖచ్చితంగా సిద్ధంగా ఉంటారు' అని స్పానిష్-అమెరికన్ తత్వవేత్త జార్జ్ శాంటాయన అంటారు. ఈ సంఘటనలు మణిపూర్‌లో పునరావృతం కాకూడదు.

ఇప్పుడున్న పరిస్థితుల్లో, శాంతి స్థాపన, బాధితులకు న్యాయం చేకూర్చడం అత్యంత ఆవశ్యకం. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, హింసకు కారకులైన వారిని శిక్షించాలి. నిరాశ్రయులైన వారికి పునరావాసం కల్పించాలి. ఇక్కడి ప్రజల మధ్య సయోధ్య కుదిర్చేందుకు చర్యలు చేపట్టాలి. 'న్యాయం ఆలస్యం అయితే, న్యాయం నిరాకరించినట్లే' అంటారు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. రెండేళ్లపాటు మణిపూర్‌కు కేంద్రప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దడం అంత సులభం కాదు. 'ఎక్కడ అన్యాయం జరుగుతుందో, అక్కడ తిరుగుబాటనేది ఒక కర్తవ్యం' అంటారు థామస్ జెఫర్సన్. బాధితులకు న్యాయం జరగాలి. స్థానికంగా వున్న వివిధ తెగల ప్రతినిధులతో చర్చలు జరపడం ద్వారా ఇప్పటికే తగిలిన గాయాలను మాన్పేందుకు చర్యలు తీసుకోవాలి. సాధారణ పరిస్థితులు పునరుద్ధరించేందుకు, శాంతి సామరస్యతను పాదుగొలిపేందుకు న్యాయమైన పరిష్కారాలను కనుగొనడానికి అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకోవాలి. నిర్దిష్ట కాలవ్యవధిలో ఎన్నికలు నిర్వహించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి. శాంతికోసం ఎదురుచూస్తోన్న ఆ ప్రజల హక్కులకు రక్షణగా నిలవాలి. అప్పుడే మణిపూర్ తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందగలదు.

### పంచాంగం

మంగళవారం 6-5-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరము

ఉత్తరాణాయణం, వసంత రుతువు

వైశాఖ మాసం

తిథి : శు. నవమి ప. 8.39

నక్షత్రం : మఘ ప. 3.52

వర్జ్యం : రా. 12.40 ల 2.26

### మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్నవారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫోటోతో సహా ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**

**vspnews4@gmail.com**

**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# పుస్తకాల తాత మురుగేశన్!



ఆయన పేరు మురుగేశన్. కానీ అందరూ ఆయనను "పుస్తకాల తాతా" అని ప్రేమగా పిలుస్తుంటారు.

తమిళనాడులోని మదురై జిల్లా అలంగానల్లూరుకి సమీపాన ఉన్న తండలై అనే గ్రామంలో 1941 ఏప్రిల్ 13న జన్మించారు ఈ పుస్తకాల తాత.

తన చిన్నవయస్సులోనే తండ్రిని కోల్పోయిన మురుగేశన్ పద్నాలుగో ఏట ఓ కిరాణా సరకులు అమ్మే దుకాణంలో చేరారు.

అయితే ఆ దుకాణానికి వచ్చే పాత పుస్తకాలను పత్రికలను చదువుతుండే ఈయన తనకు నచ్చిన వాటిని భద్రపరచి ఇతరులకు చదవమని ఇస్తుండేవారు.

క్రమంగా ఈ కిరాణా దుకాణం పాఠకుల వేదికగా దర్శనమిస్తుండేది. ఇక్కడికి సరుకులు కొనడానికి వచ్చినవారు ఈయన సేకరించిన పుస్తకాలను , పత్రికలను చదువుతూ ఆయన అభిమానులుగా మారారు. అంతేకాదు తాము చదివిన వాటి గురించి ఆయనతో చర్చించసాగారు.

అలా దుకాణానికి వచ్చిపోయేవారితో పరిచయాలు పెరిగి పుస్తకాలతో తనకున్న అనుబంధాన్ని మరింత విస్తరింపచేశారు.

పుస్తకాలను వెతికి వెతికి సేకరించడం మొదలుపెట్టిన ఆయన వాటిని ఓ క్రమపద్ధతిలో విభజించి భద్రపరిచేవారు.

అద్దెకుండిన ఇంటి నిండా పుస్తకాలే. తీరా అక్కడ చోటు చాలకపోవడంతో ఆయన ఇల్లు మారవలసి వచ్చింది. పాతపుస్తకాల పరిమళంతో జీవించడం గొప్పగా అనుకున్న ఈ పుస్తకం తాతకు తర్వాతి కాలంలో అద్దె ఇల్లు దొరకడం కష్టమైపోయింది. పుస్తకాలను మోసుకుంటూ విద్యాలయాలకు, విశ్వవిద్యాలయాలకు వెళ్ళి విద్యార్థులకు కావలసిన పుస్తకాలిచ్చి పుస్తకపఠనంపట్ల ఆసక్తిని పెంచారు. ఈ నేపథ్యంలో ఆయన పరిశోధకులకు అక్షయపాత్రగా మారారు.

పరిశోధకులకు కావలసిన అరుదైన పుస్తకాలనుసైతం ఆయన సేకరించి ఇచ్చేవారు. ప్రొఫెసర్లు, పరిశోధకులు ఆయన ఇంటికి వెళ్ళి కలుస్తుండేవారు. ఎవరికి ఏ పుస్తకం ఇచ్చినా వాటిని ఓ నోట్ బుక్కులో రాసుకునేవారు. మళ్ళా వాటిని తీసుకునేవారు. అలా తీసుకున్న వాటిని ఇతరులకు ఇచ్చేవారు.

ఇందుకోసం ఆయన ఎవరి దగ్గరా ఒక్క పైసా తీసుకునేవారు కాదు. ఎవరైనా ప్రేమతో డబ్బులిస్తే మాత్రం తీసుకునే వారు. ఆయన కుటుంబం ఈ డబ్బులతోనే గడిచేది.

విద్యాలయాలలో జరిగే కార్యక్రమాలకు ఆయన హాజరై ఓ మూల కూర్చుని ఉపన్యాసకులు చెప్పే వాటిని శ్రద్ధగా వినేవారు. అక్కడికికూడా ఆయన ఉత్త చేతులతో వెళ్ళేవారు కాదు. కొన్ని పుస్తకాలతో వెళ్ళి కావలసిన వారికి వాటిని ఇచ్చేవారు చదువుకోవడానికి.

2020లో ఆనందవిగడన్ అనే వారపత్రిక ఎంపిక చేసిన పది మంది ప్రముఖ వ్యక్తులలో ఈయన ఒకరు. 2016లో ఈయనకు చెన్నై పుస్తక సంఘం "పుస్తకప్రేమికుడు" అనే బిరుదునిచ్చి సత్కరించింది. పుస్తక జలపాతం (2015), సీనియర్ సిటిజన్ టైటిల్ (2011), సాధనపరుడు అవార్డు (2013) వంటి అవార్డులెన్నో అందుకున్న ఈ పుస్తకాల తాతకు అరుదైన పుస్తకాలకోసం ఎంత దూరమన్నా ప్రయాణించి సేకరించి చదవడంకోసం వాటిని ఇతరులకిచ్చి ఆనందపడేవారు. తీరా ఆయన రెండో తరగతికూడా చదవలేదు. అయితేనేం ఈయన ఇచ్చిన పుస్తకాలు ఎందరో విద్యావంతులకు ఉపయోగపడేవి. తమిళ విశ్వవిద్యాలయం అధికారి మా. తిరుమలై తన "పేచ్చుకళై" (మాట్లాడే కళ) అనే పుస్తకాన్ని ఈయనకు అంకితం చేయడం విశేషం. తనను పరిచయం చేసిన కొన్ని పత్రికలలో ఆయన పలువురు విద్యావంతుల పేర్లను ప్రస్తావిస్తూ వారికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు పుస్తకాల తాత మురుగేశన్.

ఓపిక ఉన్నంత వరకు తమిళ పుస్తకాలను మోస్తూ తిరిగిన ఈయన తన ఎనభై ఒకటో ఏట కన్నుమూశారు. కరోనా పూర్వం వరకూ రబ్బరు చెప్పులు వేసుకునే నడిచేవారు. అయితే వయోభారంతో చివరి రోజుల్లో ఇంటి దగ్గరే ఉండి తనకోసం వచ్చేవారితో పుస్తకాల గురించి మాట్లాడి ఆనందించేవారు.

**– యామిజాల జగదీశ్**

# అప్పుడు మట్టి.. ఇప్పుడు మాటలే!



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం పున:ప్రారంభోత్సవం ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా జరిగింది. చాలా ఆలస్యంగానైనా ఈ పున:ప్రారంభం జరిగినందుకు అందరూ సంతోషిస్తున్నారు. దేశంలో కొన్ని రాజధానుల నిర్మాణం, నిర్ణయంలో ముందు వెనకలు నిజమే కానీ ఈ విధంగా ఒకే చోట ఒకే ప్రధాని రెండుసార్లు ప్రారంభించడం జరిగి ఉండదు. దేశంలోనూ రాష్ట్రంలోనూ నెలకొన్న అసాధారణ రాజకీయ పరిస్థితులు, రాజకీయ పార్టీల అవకాశవాద పోకడలకు అద్దం పట్టే సందర్భం ఇది. 2015లో అక్టోబర్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఇదే కూటమి అధికారంలో ఉన్నప్పుడే అమరావతికి శంకుస్థాపన జరిగింది. జనసేన అధిపతి పవన్ కల్యాణ్ ఎన్నికల్లో పోటీ చేయకపోవడం మినహా మిగిలిన వాతావరణం అచ్చం అదే. అందరూ వాళ్లే అయినప్పుడు పదేళ్ల ఆలస్యంగా మళ్లీ ప్రారంభించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్న అనివార్యం. అప్పుడు కూడా ఇదే నాయకులు ఇవే మాటలు చెప్పడం విన్న ప్రజలకు ఈ సందేహం రావడం సమర్థనీయమే. 2015-19 మధ్య కాలమంతా చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఆ దశలో సింగపూర్ భాగస్వామ్యం గురించి గొప్ప ప్రచారం కూడా జరిగినప్పటికీ రాజధాని ముందుకు కదల్లేదు ఎందుకు? శాసనసభ చర్చలో ఈ రాజధానికి మద్దతు ప్రకటించి, అధికారంలోకి వస్తే తాము దాన్ని నిలిపివేస్తామన్న ప్రచారంలో నిజం లేదని భరోసా ఇచ్చిన వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి హయాంలో అది ఎందుకు నిలిచిపోయింది? అప్పుడు, ఇప్పుడు, మధ్యలో జగన్ హయాంలోనూ రాష్ట్ర పాలకులతో రాజకీయ సాన్నిహిత్యం నడిపిన, వెంట తిప్పుకున్న ప్రధాని మోడీకి ప్రతిష్టంభనతో సంబంధం లేదా? జగన్ దాన్ని నిలిపివేసినప్పుడు అధికారికంగా గాని, రాజకీయంగా గాని జోక్యం చేసుకున్నది లేదు. రాజధాని పూర్తిగా రాష్ట్ర శాసనసభ నిర్ణయమని ఉన్నత న్యాయస్థానాల్లో అఫిడవిట్‌లు కూడా దాఖలు చేశారు. కేంద్రం ఆధ్వర్యంలోని 40 సంస్థలకు విలువైన భూములు కేటాయించినప్పటికీ ఏ నిర్మాణాలూ చేసింది లేదు. ఇన్ని అనుభవాలు ఉన్నాయి కనుక పున:ప్రారంభోత్సవం ఎంత ఆర్భాటంగా జరిపినా ఆచరణలో ఏం జరుగుతుందన్న ప్రశ్న తప్పనిసరి.

**నిర్దిష్టమైన ప్రకటనలు, నిధుల మంజూరు ఏవీ!**

గతం ఏమైనప్పటికీ అమరావతిలో కదలిక రావడాన్ని స్వాగతించవచ్చు. కానీ చరిత్ర పునరావృతం అవుతుందన్నట్లు నరేంద్ర మోడీ ప్రసంగం సాగింది. 2017లో వచ్చినప్పుడు ఎలాంటి ఆర్థిక సహాయం ప్రకటించింది లేదు. ప్రత్యేక హోదాకు విభజన చట్టంతో పాటు అవకాశం కల్పించిన చంద్రబాబు అడిగింది, మోడీ ఇచ్చింది శూన్యం. రూ.42 వేల కోట్ల మేరకు ఆర్థిక సహాయం కావాలని అప్పట్లో ప్రభుత్వం అడిగితే కేంద్రం రూ.1500 కోట్లు మాత్రమే సచివాలయం, శాసనసభ, రాజ్‌భవన్ వంటి వాటి కోసం కేంద్రం సహాయం చేసిందని అన్నారు. అవీ తాత్కాలిక నిర్మాణాలుగానే ఉండిపోయాయి. ఉత్సాహం కోసం నాడు చంద్రబాబు గ్రామ గ్రామాల నుంచి మట్టి తెప్పిస్తే%ా% నేను సైతం అన్నట్టుగా మోడీ ఢిల్లీ నుంచి మట్టి, నీళ్లు తీసుకువచ్చి హాస్యాస్పద సన్నివేశం సృష్టించారు. దేశమంటే మట్టి కాదోరు అన్న గురజాడ సూక్తికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించారు. ఈ పున:ప్రారంభంలో ఆ మట్టి, నీళ్లు కూడా లేకపోవడం%ా%.ఒట్టిమాటలు కట్టిపెట్టోరు అన్న గురజాడనే మరోసారి తలపించింది. ఎందుకంటే ఈసారి కూడా నిర్దిష్టమైన ప్రకటనలు గాని, నిధుల మంజూరు కానీ లేవు. ప్రపంచ బ్యాంకు, హడ్కోల నుంచి రూ.50 వేల కోట్ల అప్పు మాత్రం ఇప్పిస్తున్నారు. నక్షత్రకుడిలా వాళ్ళు మోడీ కన్నా ముందుగానే అమరావతి సందర్శించి ఆదేశాలు జారీ చేసి వెళ్లారు. కనీసం కేంద్ర ప్రభుత్వ సంస్థలను వేగంగా పూర్తి చేస్తామన్న హామీ కూడా మోడీ నుంచి వచ్చింది లేదు. కనెక్టివిటీ, రాకపోకల సంబంధాల పెరుగుదల గురించే ఆయన ఎక్కువగా మాట్లాడారు.

చంద్రబాబు సాంకేతిక విజన్ గురించి గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగానే తాను అధ్యయనం చేశానని మోడీ ప్రశంసలు కురిపించడం బాగానే ఉంది కానీ 2018లో వీరిద్దరూ విడిపోయి ఎంతగా ఆరోపణలు చేసుకున్నారో ఎలా మర్చిపోతాం? మోడీ నాయకత్వం ఉన్నందువల్లే భారతదేశం ప్రపంచ శక్తిగా ఆవిర్భవించిందని చంద్రబాబు పొగిడితే, బాబు దార్శనికత వల్లే అమరావతి పున: ప్రారంభమవుతోందని మోడీ కొనియాడారు. కేంద్ర వైఖరిలో మార్పును సూచించే ప్రకటనలు, నిధుల విడుదల లేకుండా, నిర్మాణం చేపట్టకుండా మోడీ వచ్చారని మురిసిపోవడంలో ఔచిత్యం ఉందా? భుజం కాయటం, అండగా నిలబడటం లాంటి మాటలు రాజధాని పూర్తి చేస్తాయా? జగన్ ప్రభుత్వం అమరావతిని ఉన్న ఫళాన నిలిపివేసినప్పుడు కూడా మోడీ ఆయనతో ఉన్నారు. అమరావతి ఉద్యమం పట్ల బిజెపి వైఖరి ఏమిటి అన్నది కూడా చాలా కాలం పాటు అయోమయంగానే ఉండింది. చివరకు రైతులు తిరుపతి యాత్ర చేసిన సమయంలోనే బిజెపి బహిరంగంగా మద్దతు తెలిపింది. ఏది ఏమైనా రాజధాని నిర్మాణం భారం ఏపీ ప్రభుత్వమే మోయాలి అన్నది మోడీ వైఖరిగా స్పష్టమవుతుంది. ప్రపంచ బ్యాంకు అప్పు కేంద్రమే చెల్లిస్తుందని ఏపీ బిజెపి నాయకులు చెప్పే మాటలకు ఆధారంగా అధికార పత్రం ఏమైనా ఉందా? మధ్యలో దాన్ని నిలిపివేసిన జగన్ పైన కూడా ఆయన ఏమీ పెదవి మెదపలేదు.

**సందేహాల మధ్య 'నమో' భజన**

బాబు, పవన్, లోకేష్‌ల విషయానికి వస్తే అమరావతి నరేంద్ర మోడీ భజనతో మార్మోగింది. నమో మిసైల్ అని కూడా లోకేష్ అభివర్ణించారు. కాశ్మీర్‌లో ఉగ్రవాద మారణకాండ నేపథ్యంలో పాకిస్తాన్‌తో ఏర్పడిన ఉద్రిక్తతలను ప్రస్తావిస్తూ మోడీని మహాశక్తిగా అలౌకిక భాషలో కీర్తించటం హాస్యాస్పదం. అన్ని పార్టీలు ఉగ్రవాదంపై పోరాటానికి మద్దతునిచ్చిన మాట నిజమే. వ్యక్తిగతంగా మోడీ ఏదో ఒంటరిగా పోరాడుతున్నట్లు చెప్పడం అశేష ప్రజానీకాన్ని తక్కువ చేయటం లాంటిదే. ఈ ముగ్గురి ప్రసంగాలలోనూ జగన్ నిర్వాకాన్ని తీవ్రంగానే అభిశంసించారు. కానీ ఆయనకు మోడీ ఆశీర్వాదాలు అందించారనే అంశాన్ని దాటేశారు. రాజధాని నిలిచిపోయిన సమయంలో పోరాడిన రైతులను, ముఖ్యంగా మహిళలను ప్రశంసించటం బాగుంది కానీ 914 సి.ఆర్.డి.ఏ ఒప్పందంలోని అనేక అంశాలను ఇంకా అమలు చేయలేకపోయిన పరిస్థితిని మాత్రం చెప్పలేదు. విమానాశ్రయం కోసం మరో 45 వేల ఎకరాలు సమీకరించటం గురించి మాట్లాడలేదు. రైతాంగంలో ఇప్పటికే అసంతృప్తి వ్యక్తం అవటం ఇందుకు కారణం కావచ్చు. పదేళ్ల తర్వాత పున: ప్రారంభం చేసుకుంటున్న అమరావతిపై సర్వ శక్తి యుక్తులు పెట్టే బదులు మరేదో నిర్మించాలని భూమి సేకరించటం అంతు పట్టని విషయం. గన్నవరం విమానాశ్రయం కోసం సేకరించిన భూములకే ఇంకా పరిష్కారం దొరకలేదు. అమరావతి వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకోవడం ఒకటైతే అది విశ్వనగరంగా దేశ అభివృద్ధికి కేంద్రంగా మారిపోతుందని చెప్పడం ఎలా కుదురుతుంది? కొద్దిరోజుల కిందట మంత్రి నారాయణ మాట్లాడుతూ విజయవాడ గుంటూరుతో కలిపి అమరావతిని మెగా సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. అదే విధానమైతే చాలా సమస్యలు వచ్చి వుండేవే కావు. ఇప్పుడు కూడా ఒకే చోట మొత్తం కేంద్రీకరిస్తే ప్రజలు ఆమోదించరు. చంద్రబాబు అది గ్రహించబట్టే సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని లేట్‌గా ట్వీట్ చేశారు.

**మారని వైసిపి – అదే పాట**

ఇదే సమయంలో వైసిపి నాయకులు పున:ప్రారంభంపై చేసే విమర్శకు ఔచిత్యం లేదు. దాన్ని పూర్తిగా పక్కకు నెట్టి మూడు రాజధానుల ముచ్చటతో కాలం గడిపి ఇప్పుడు దీనిపైన దాడి చేయటాన్ని ప్రజలు హర్షించరు. రాజధాని కట్టే బదులు మహానగరం అంటూ చంద్రబాబు పక్కదోవ పట్టించారని వారు అంటున్నారు. మరి తాము రాజధాని వరకే పరిమితమై కట్టి ఉండాలి కదా? దాదాపు పూర్తయిన భవనాలను కూడా పాడు పెట్టడం, మొత్తం అడవిలా అల్లుకుపోతుంటే ఉపేక్షించడం ఎంత బాధ్యతా రాహిత్యం? తమకు 40 శాతం మంది ఓట్లేశారు కనుక వారంతా అమరావతికి వ్యతిరేకమేనని కొంతమంది వైసిపి వర్గాలు చెప్పుకోడం ఆశ్చర్యం కలిగిస్తుంది. కర్నూల్‌లో హైకోర్టు ఏర్పాటుకు అన్ని పార్టీలు అంగీకారం తెలిపినప్పటికీ ఆ దిశలోనైనా వైసిపి ప్రభుత్వం చేసింది ఏంటి?

ప్రజా రాజధానిగా అమరావతి అనే పల్లవిని మళ్లీ వినిపిస్తున్నదిగానీ పెట్టుబడి పెట్టే ప్రపంచ బ్యాంకు అందుకు ఒప్పుకోవటం జరిగే పనేనా? ఇప్పటికే రాజధానిలో పెట్టిన ఖర్చు రాబట్టడం ఎలాగనే చర్చ బ్యాంకు లేవనెత్తుతున్నది. ఆ అప్పులతో రాజధాని కట్టడం అంటే అడుగడుగునా ఆంక్షలు, షరతులకు తల వంచడమే. ఏమైనా రాజధాని ప్రక్రియను వేగంగా, ప్రజోపయోగకరంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంది. మూడేళ్లలో పనులు పూర్తి అవుతాయి అంటే అర్థం అప్పటికి ఈ ప్రభుత్వం చివరి ఏడాది పాలనలో ఉంటుంది. జమిలి ఎన్నికలు వంటి మాటలు వింటున్న దృష్ట్యా ఈ లోగా కూడా ఏం జరుగుతుందో చూడాల్సిందే.

## వేసవి తాపం

సూర్యుడి స్నేహానికి
శాపగ్రస్తమైన పంచభూతాలు
వేడిమితో జతకట్టిన గాలులు,
మన ఊరిని ఉదిపరేస్తున్నాయి.

రోడ్లు నిప్పుల చీర చుట్టినట్టు
భగభగమంటున్నాయి
దేహంలో స్వేదం ఏరులై పారుతూ
వానజల్లును తలపిస్తున్నాయి

పక్షులను మోయలేని ఎండిన చెట్లు
చల్లని నీటి కోసం పరితపిస్తున్నాయి
వడగాలికి అల్లాడిన జనం
ఓ చల్లని వెన్నెలను ఆశగా వెతుకుతున్నారు

వరుణుడి దయ కోసం ఎదురు చూస్తూ
బ్రతకలేని జీవకోటి ఉసురుమంటూ
కృత్రిమ శీతల గాలిని ఆలింగనం చేసుకుంటూ,
నాలుగు గోడల మధ్య బందీలుగా మిగిలిపోయారు!!



వి.జ్యోతి ముప్పల

# కలలు కనండి.. కథలు చెప్పండి

## ఆరెంజ్ ఎకానమీ అభివృద్ధికి తొలిమెట్టు



కలలు కనండి.సృజనాత్మక కథలు చెప్పండి.ప్రపంచానికి మార్గదర్శనం చేయండి అంటోంది" వేవ్స్ "సమ్మిట్. సృజనాత్మక కంటెంట్ సృష్టితో భారత్లో నారింజ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించింది.సంస్కృతి,కళ మేథోవిలువ కలిగిన వస్తువులు, సేవలు ఉత్పత్తినే ఆరెంజ్ ఎకానమీ అంటారు.ఇది భారత్ దేశం జీడీపీలో దాదాపు మూడు శాతం పైగా కలిగి ఉంది. అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించుకుని సేవలు ఉత్పత్తిని పెంచటమే లక్ష్యంగా "వేవ్స్" ఆవిర్భవించింది.100 కుపైగా దేశాలనుంచి కళాకారులు,పెట్టుబడిదారులు,విధాన రూపకర్తలు బొంబాయిలో ఇటీవల జరిగిన మొదటిసభకు హాజరయ్యారు.ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ప్రధాని మోదీ ప్రపంచకేంద్రంగా భారత్లో ఆరెంజ్ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నదని పేర్కొనడం విశేషం. చలనచిత్ర నిర్మాణం,డిజిటల్ కంటెంట్,గేమింగ్, ఫ్యాషన్,సంగీతం,స్టోరీ టెల్లింగ్, యానిమేషన్, ప్రత్యక్ష కచేరీలకు భారత్ కేంద్రంగా ప్రపంచానికి మార్గదర్శనం చేస్తున్నది.ప్రపంచ సృష్టికర్తలు వారు కన్న కలలు, కథలను చెప్పాలి.పెట్టుబడిదారులు వేదికలపైనే కాదు, ప్రజలలో కూడా పెట్టుబడి పెట్టాలి. భారతీయ యువత విజయగాథలు, కథలను లక్షల్లో ప్రపంచానికి చెప్పాలి. కంటెంట్ సృష్టి లో యువత ప్రధాన పాత్ర వహించాలని మోదీ ఆకాంక్షించారు.యువతలో సృజనాత్మకత స్వేచ్ఛగా ప్రవహిస్తున్నది. వారి శైలి,స్ఫూర్తికి ఎలాంటి హద్దులు ఉండవు.అందువల్ల కంటెంట్ సృష్టికి వీరే కర్తలుగా నమ్ముతానని మోదీ అనడం విశేషం.

వేవ్స్ అనేది సంస్కృతి, సృజనాత్మకత, సార్వత్రిక అనుసంధాన తరంగం. ఇది భారతీయ సృజనాత్మక బలాలను ప్రపంచ వేదికపై వ్యక్తీకరిస్తుంది. వేవ్స్ ప్రపంచ ఆడియో విజువల్, వినోదసమ్మిట్ కంటే ఎక్కువే.బిలియన్ కంటే ఎక్కువ జనాభా ఉన్న భారతదేశం బిలియన్ కంటేఎక్కువకథలకు నిలయంగా ఉంది. వేయి సంవత్సరాల కథల నిధిని కలిగి ఉంది. బొంబాయి వేవ్స్ మొదటి సమ్మిట్ ప్రపంచ వ్యాప్తంగా మోతమోగించింది.ఈ సమ్మిట్ లో భారతీయ చలనచిత్ర ఉద్దండ నటులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ తదితరులు పాల్గొన్నారు.నాలుగు రోజులు పాటు కేంద్ర ప్రసార సమాచార శాఖ నిర్వహించింది. కంటెంట్ సృష్టికర్తలు అన్ని విభాగాల నుంచి అనుసంధానించే లక్ష్యంతో మీడియా, వినోద రంగాలను విస్తరించింది. భారత్లో సృష్టించడానికి,ప్రపంచం కోసం సృష్టించడానికి ఇది సరైన సమయంగా ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ భావన కాలాతీతమైనది, ఆలోచింపజేసేదన్నారు. సృజనాత్మకత గేమింగ్, సంగీతం, చిత్రనిర్మాణలలో తరచూ మనకి కనిపిస్తుంది. ఈ సృజనాత్మకతే భారతీయ జీడీపీని వృద్ధి చేస్తుందని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ సృష్టికర్తలు భారతదేశాన్ని కంటెంట్ మైదానం గా చేసుకుని కథ చెప్పే సామర్థ్యం పై పెట్టుబడి పెట్టాలని ప్రధాని పెట్టుబడిదారులను ఆహ్వానించడం గమనార్హం.ప్రపంచ ప్రేక్షకులు కథలు చెప్పే కొత్త మార్గాలను కోరుకుంటున్నారని, భారత్‌లో యువత దాన్ని సృష్టించాలని మోదీ పిలుపునిచ్చారు. భారతీయ సినిమాలు ప్రపంచ ప్రేక్షకులను చేరుకుంటున్నాయని, ఇటీవల ఓటీటీ ఫ్లాట్ ఫాంలు పదిరెట్లు పెరిగిన విషయం గుర్తు చేసారు. భారత దేశ కథలు ప్రపంచ నలుమూలలకు చేరేలా చూడాలన్నారు. పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ వినోదాన్ని మృదువైన శక్తిగా కాకుండా నిజమైన శక్తిగా మారుతుందనడంలో అనుమానం లేదన్నారు. రామాయణం, మహాభారతం వరకూ భారత్ కు కథలు చెప్పే శక్తి ఏ దేశానికి లేదన్నారు.ఇవి భారత్తో పాటు ప్రపంచాన్ని ఒక్కటిగా ఉంచే శక్తి ఉందన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగ ప్రవేశంతో ఆరెంజ్ ఎకానమీ రూపురేఖలు మారనున్నాయి. భారత్ లో కటెంట్ సృష్టితో ఈ రంగం100 బిలియన్ డాలర్లమార్క్ ను దాటడం ఖాయమని చెప్పవచ్చు.ఉద్యోగితతో పాటు అభివృద్ధి జరిగి ఆదాయం పెరగడం ఖాయం. ఆరెంజ్ ఎకానమీ తో భారత్ అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లడమే కాక ప్రపంచ నాయకత్వం వహించే రోజు ఎంతో దూరంలో లేదు.

**యం.వి. రామారావు, 8074129668**

2nd pages11.qxd 5/5/2025 9:08 PM Page 5



# ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):-** విశాఖ తూర్పు 12వార్డు వార్డులో సంత పాలెం, సామాజిక భవనం లో బిసి, కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ఎమ్మెల్యే శ్రీవెలగపూడి రామకృష్ణ బాబు ముఖ్య అతిధి గాహాజరై ప్రారంభించిరి ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ శిక్షణ సుమారు 90,రోజులు ఉంటుందనీయు మహిళలు అందరు శ్రద్దగా నేర్చుకొని మంచి టైలర్ల గా, ఎదగాలనీయు టైలర్స్ కీ మార్కెట్ లోఆర్థికంగా నిలబడడానికి మంచి అవకాశాలు ఉన్నాయనియు శిక్షణ పూర్తి ఆయన తరువాత ఉచితంగా కుట్టు మిషన్లు అందచేస్తా మనీయు అలాగే గ్రూపులు గా ఏర్పడితే, స్కూల్, హాస్టల్, విద్యార్థుల యూనిపామ్స్, కుట్టే కాంట్రాక్టు ను ఇప్పిస్తామనీయు ఏ సమస్య ఉన్న నా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామనీయు చెప్పిరిఆయన తో పాటు, రాష్ట్ర అరగనైజింగ్ సెక్రటరీ, ఒమ్మి సన్యాసిరావు వార్డు అధ్యక్షులు గాడి సత్యం, వార్డు ఇంచార్జి,ఒమ్మి అప్పలరాజు పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓమ్మీపోలారావు గారు పార్లమెంట్ సెక్రటరీఏడువాకు సన్యాసిరావు, వార్డు సెక్రటరీ పోతినా భరత్ 11 వార్డ్ అధ్యక్షులు ముగడు రాజారావు, సీనియర్ నాయకులు నంబారు గోపి, బసవ దేవుళ్లు, తిమోతి, రామకృష్ణ , దానాల ఈశ్వరరావు, శ్రీను, ,రమణ, ఆనందు, గోపి రాజు, నర్సింగ్ , గణపతి, మహిళా నాయకులు విజయమ్మ , ఈలలక్ష్మి, కృష్ణవేణి, వరలక్ష్మి, స్థానిక సంత పాలెం గ్రామ పెద్దలు యువకులు మరియు కుట్టు మిషన్ లబ్ధి దారులు మహిళలుకార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రమోషన్‌లలో ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలి



**కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):-** ప్రమోషన్స్‌లో ఎస్సీ రిజర్వేషన్ పాటించే క్రమంలో ఎస్సీ వర్గీకరణ చట్టం ప్రకారం రిజర్వేషన్ వాటాలు ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ ఆర్డీవో కు వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున రిటైర్డ్ జిల్లా జడ్జి ఖండెల్లి భీష్మ గాంఘేయుడు , దళిత నాయకులు పెనుమాక జయరాజు, కొప్పాక విజయానంద జవహర్, తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం ప్రతినిధి బొల్లిపో మధు శేఖర్ పాల్గొన్నారు.

# ఘనంగా మత్స్య జాతర ప్రారంభం



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** మత్స్యరాస వంశీకుల కులదేవత జి మాడుగల మండల ప్రజల ఆరాధ్య దేవత శ్రీ మత్స్యమడుగులమ్మ జాతర ఆదివారం నాడు ఘనంగా ప్రారంభమైంది. కీర్తిశేషులు పార్లమెంటు సభ్యులు స్వర్గీయ మత్స్యరాస మత్స్య రాజు స్వగృహం నుంచి ఆనవాయితీగా అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి రామాలయం వద్ద ఏర్పాటుచేసిన శతకం పట్టు వద్ద మాజీ మంత్రివర్యులు మత్స్యరాస బాలరాజు,మణి కుమారి,మాజీ ఎంపీపీ వరహాలమ్మ, విజయకుమారి ఆధ్వర్యంలో పూజారి కిమ్ముడు.కొలువు తీర్చారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్య రాస రామరాజు ప్రధాన కార్యదర్శి గసాడి రెడ్డి బాబు ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు ( బుజ్జి) మత్స్యరాస సింహా చలం రాజు రామచంద్ర రాజు.నాగరాజు. కిమ్ముడు సింహాచలం చలం. తో పాటు గ్రామస్తులు ఉద్యోగులు గ్రామస్తులు పాత్రికేయులు,భక్తులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు




**అచ్యుతాపురం, (విశాఖ సమాచారమ్):-** పరిశ్రమ గేటు వద్ద కార్మికులతో నిరసన కార్యక్రమం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, మండల కన్వీనర్ కే. సోమనాయుడు మాట్లాడుతూ అధిస్తాన్ లో వర్ధమాన్ పరిశ్రమలో వేతనాలు పెంచకుండా 12 సంవత్సరాలుగా శ్రమ దోపిడికి గురి చేస్తుందని,యాజమాన్యం రాకేష్ వినీత్ కార్మికుల్ని వేధింపులు గురిచేస్తున్న యాజమాన్యపై చర్యలు తీసుకోవాలని, ఓటి చేసిన కార్మికులకు భోజనం, ట్రావిలింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని, సెలవులు ,ఉద్యోగ భద్రత, నెలకు రెండు గంటలు పర్మిషన్, స్కూల్ పిల్లలకు బ్యాగులు,స్కాలర్ షిప్ లు, యూనిఫామ్ మెటర్నిటీ లీవులు తదితర న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని లేదంటే కార్మికులందరినీ ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

# గాజువాకలో వజ్రాల ఎగ్జిబిషన్ ప్రారంభం







**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ మే 3, 4 తేదీలలో గాజువాక హొటల్ బెస్ట్ వెస్టన్ రామచంద్రాలో రేర్ సాలిటైర్ వజ్రాల రెండు రోజుల గ్రాండ్ ఎగ్జిబిషన్ నిర్వహించింది. విశాఖపట్నం ప్రాంతంలోని గాజువాకలో నిర్వహించిన మొట్టమొదటి సాలిటైర్ వజ్రాల ప్రదర్శన వజ్రాల ప్రేమికుల మనస్సు దోచుకుంది.హరి కృష్ణ గ్రూప్ వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఘనశ్యామ్ ధోలాకియా గౌరవ అతిధిగా హాజరై వజ్రాల ఎగ్జిబిషన్ ప్రారంభించిన అనంతరం ఆయన మీడియా తో మాట్లాడుతూ కిస్నా బ్రాండ్ దృష్టి ప్రతి భారతీయుడికి వజ్రాలను అందుబాటులో ఉంచడమన్నారు. గాజువాక వంటి అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇలాంటి ప్రదర్శనలతో, వినియోగదారులకు పారదర్శకంగా మరియు సరసమైన ధరలకు ఉత్తమ నాణ్యత గల వజ్రాలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.గాజువాక పరిసర ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన అధిక స్పందన తమకు ఎంతో సంతోషం కలిగించిందన్నారు.కిస్నా గాజువాక ఫ్రాంచైజ్ భాగస్వాములు రాంబాబు కొత్తపల్లి, లక్ష్మణరావు, భీమారావు, దామోదరరావులు వినియోగదారులకు స్వాగతం చెబుతూ గాజువాకలో వజ్ర ప్రియుల కోసం మొదటిసారిగా అద్భుతమైన ఈవెంట్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులు 0.30 సెంట్ల నుండి 5 క్యారెట్ల వరకు సాలిటైర్ వజ్రాలను కొనుగోలు చేయవచ్చునన్నారు. కేవలం ?32,000 రూపాయల నుండి తమ వద్ద అపురూప వజ్రాలు లభిస్తాయన్నారు.ఈ ప్రదర్శనలో మహిళా వినియోగదారులకు మెహందీ కార్యక్రమం, ప్రతి వినియోగదారునికి బహుమతులు అందచేశారు. పెద్ద సంఖ్యలో గాజువాక పరిసర ప్రాంత వజ్రాలు,నగల ప్రేమికులు, స్థానిక ప్రముఖులు కుటుంబ సమేతంగా రేర్ సాలిటైర్ వజ్రాల ప్రదర్శనకు హాజరై కొనుగోళ్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

# కుల గణన క్రెడిట్ రాహుల్ గాంధీకే దక్కుతుంది : డా విజయ్ చంద్ర

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రానున్న జనగణనలో కులం ఆధారిత జనాభా గణనను నిర్వహించాలన్న భారత జాతీయ కాంగ్రెస్ డిమాండ్‌ను11 సంవత్సరాల నిరంతర వ్యతిరేకత, మొండి నిరాకరణ తరువాత మోదీ ప్రభుత్వం చివరికి అంగీకరించిన తరుణంలో కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తూ కాంగ్రెస్ విశాఖ నాయకుడు డా. విజయ్ చంద్ర తన స్పందనను విశాఖ సమాచారతో పంచు కొన్నారు.

కులగణనపై దేశవ్యాప్తంగా గట్టిగా, స్థిరంగా నిలబడి పోరాడిన శక్తివంతమైన స్వరం రాహుల్ గాంధీ గారిదని అయన పునరుద్ఘాటించారు. 2022లో ఉదయపూర్‌లో జరిగిన నవ్ సంకల్ప్ శివిర్‌లో రాహుల్ గాంధీ కుల గణాంకాల సేకరణ అత్యవసరం అని స్పష్టం చేశారు, తద్వారా తక్కువ ప్రతినిధ్యం కలిగిన వర్గాల వాస్తవ జీవిత పరిస్థితులను అర్ధం చేసుకోవచ్చని అయన అన్నారు. ఈ డిమాండ్‌ను 2023లో రాయ్‌పూర్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీలో పునరుద్ఘాటించారు. ఈ అంశాన్ని 2019, 2024 లోక్‌సభ మేనిఫెస్టోలలో కీలక అంశంగా చేర్చారు. పార్లమెంటులో, దేశవ్యాప్తంగా ప్రసంగాల్లో, రెండు భారత్ జోడో యాత్రలలో, మీడియా సమావేశాలలో కూడా కులగణన ద్వారా సామాజిక న్యాయం లోతుగా అధ్యయనం మరియు ప్రణాళిక చేయడానికి అవసరమని రాహుల్ గాంధీ అన్నారని అయన పేర్కొన్నారు.

రిజర్వేషన్లు, సంక్షేమం మరియు ప్రతినిధ్యం మొదలైన అంశాలలో విధానాలు పాత విధానాలతో కాకుండా వాస్తవాలపై ఆధారపడాలని రాహుల్ గాంధీ నిత్యం స్పందిస్తూ ఉన్నారని డా విజయ్ చంద్ర పేర్కొన్నారు.

11 సంవత్సరాలుగా ప్రధాన మంత్రి ఈ డిమాండ్‌ను చేసిన కాంగ్రెస్ నాయకత్వాన్ని నిందిస్తూ దాడులు చేసినా చివరకు కుల గణనకు ఆమోదం తెలపడం ముదావాహం అని అయన పేర్కొన్నారు.

అయితే ప్రభుత్వం ఈ అంశాన్ని ఎలా అమలు చేయబోతోందో ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఎలాంటి ఆర్థిక కేటాయింపులు కూడా చేయలేదు.

కాబట్టి త్వరలో విధి విధానాలను ప్రకటించాలని విజయ్ చంద్ర కోరారు.

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు ఓబీసీల రిజర్వేషన్లపై ఉండే 50 శాతం పరిమితికి తార్కికతలేని కారణంగా ఆ పరిమితిని తొలగించాలని కాంగ్రెస్ పార్టీ కోరుతున్న విషయాన్ని, ఆ అంశంతో పాటు భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15(5)ని తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని, ఇది ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఓబీసీలు, దళితులు మరియు ఆదివాసీలకు రిజర్వేషన్లను కల్పించడానికి ఉద్దేశించినదని, ఈ డిమాండ్‌ను కాంగ్రెస్ మేనిఫెస్టోలో స్పష్టంగా పేర్కొందని కేంద్ర ప్రభుత్వం ఈ అంశాలను కూడా గుర్తించాలని అయన కోరారు.

# కలెక్టర్ కార్యాలాయానికి అద్దె భవనం, అధికార పార్టీకి మాత్రం సొంత భవనం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** జిల్లా కలెక్టర్ కార్యాలాయమే అద్దే భవనంలో నడుస్తుంటే అదికార పార్టీ కి మాత్రం జిల్లా కలెక్టర్ గారు సోంత భవనానికి స్థలం కేటాయించి తను దైవ భక్తిని చాటుకున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న పేర్కొన్నారు.ఆదివారం అయిన ఓ ప్రకటన విడుదల చేసారు, అనకాపల్లి విభజన జరిగి సుమారు నాలుగు సంవత్సరాలు కావాస్తున్న జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు ఒక్క సోంత భవనానికి కూడా స్థలం లేదని అదికార పార్టీ కి మాత్రం రెండు వేలు రూపాయలకే 33 సంవత్సరా లకు లీజుకు భూమి కేటాయించడం విడ్డూరంగా ఉందన్నారు.అనకాపల్లి మండలం కోత్తూరు రెవిన్యూ సర్వేనెంబర్ 608-10 లో కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని సంవత్సరానికి రెండు వేలకు 33 సంవత్సరాలకు తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి లీజుకుకు ఇవ్వడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం తప్పుపడుతుందని తెలిపారు ఈ లీజును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం గాని, ఎస్పి కార్యాలయం, జిల్లా కోర్టు,రిజిస్టర్ ఆఫీస్, బీసీ,ఎస్సీ వెల్ఫేర్ అన్ని రకాలు ఆఫీసు నేటికీ సోంత స్తాలాలు లేక అద్దె భవనాల్లో నడుస్తున్నాయని తెలిపారు.

# సలుగు గ్రామంలో ఘనముగా మర్రి రామయ్య వర్ధంతి



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి సీతారాంరాజు జిల్లా పాడేరు మండలం సలుగు పంచాయతీ బూరుగు చట్టు గ్రామంలో మర్రి కామయ్య వర్ధంతి ఘనంగా నిర్వహించారు. బూరుగు సుట్టు గ్రామంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులు జి సత్య రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.స్వతంత్ర సమరయోధుడు మన్యం పులి బిడ్డ మా కోశం ప్రాణాలు త్యాగం చేసిన రోజుని ప్రతి గ్రామాలలో ప్రతి పల్లెలో జరుపుకోవాలని ఆశిస్తున్నాము అని, జోహార్ మర్రి కామయ్య అంటూ గానవాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బూరుగుచట్టు గ్రామస్థులు పీ ఆనందరావు,సత్తిబాబు.పీ, సూరిబాబు. పీ రామారావు, పిలుకో ఈశ్వరి యూత్ పాల్గొన్నారు.

# టీడీపీ కార్యకర్తకు రూ.5 లక్షల బీమా సాయం

- ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం
- "కార్యకర్తలే మా శక్తి - వారి కోసం ఉన్నది తెలుగుదేశం పార్టీ" లోకేష్ నాయకత్వం యువతకు దిక్సూచి



**గాజువాక, (విశాఖ సమాచారమ్):-** ప్రమాదవశాత్తు మృతి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త బొబ్బడి కనకారావు కుటుంబానికి పార్టీ అండగా నిలిచింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే శ్రీ పల్లా శ్రీనివాసరావు గారు స్వహస్తాల ద్వారా, నామినీగా ఉన్న ఆయన భార్య బొబ్బడి లక్ష్మీ గారికి రూ.5 లక్షల బీమా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబాన్ని పరామర్శిస్తూ మానవీయంగా సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, "కార్యకర్తలే మా బలం. వారి కోసం ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీ అండగా నిలబడుతుంది" అని స్పష్టం చేశారు.

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ నాయకత్వంలో కోటికి పైగా సభ్యత్వాలు నమోదు చేయడం ఆయన నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం. అయితే ఆ సంఖ్యల కంటే గొప్పది ప్రతి కార్యకర్త భద్రతపై ఆయన చూపే నిబద్ధత.

ఆ దృక్కోణం నుంచే రూపొందినది తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమ బీమా పథకం. ఈ బీమా సహాయం ద్వారా పార్టీ తమ కుటుంబ సభ్యుల పట్ల ఉన్న బాధ్యతను కార్యరూపంలో చూపుతోంది.

సంఘటనలు జరిగిన వెంటనే స్పందించి, తక్షణమే చర్యలు తీసుకోవడం – తెలుగుదేశం పార్టీ ప్రత్యేకత. మాటలకన్నా ముందే చేతల్లో చూపే పార్టీకే ప్రజల మద్దతు నిలుస్తుందనే విశ్వాసాన్ని ఈ సంఘటన మరొక్కసారి నిదర్శనం చేస్తోంది.

# విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డీఎస్సీ - జనరల్ నాలెడ్జ్ , కరెంట్ అఫైర్స్

1.సినిమా రికార్డింగు పరిభాషలో 'డి.టి.ఎస్.' అంటే ఏమిటి? : డిజిటల్ థియేటర్ సిస్టమ్

2. 'ఎంబామింగ్' అనగానేమి?

జ: మృతదేహాన్ని చెడిపోకుండా రసాయనాలతో నిల్వ ఉంచే ప్రక్రియ

3. 'వెజ్గా' అనగానేమి?

జ: రష్యా నిర్మించిన స్పేస్ మాడ్యూల్ పేరు

4.క్రీ.శ. 1835లో ఆంగ్ల విద్యను మన దేశం లో ప్రవేశపెట్టినది? జ లార్డ్ విలియం బెంటింక్

5. రాజ్యాంగహోదా ఉన్న కమిషన్లు ఏవి?

జ. ఆర్థిక సంఘం, ఎన్నికల సంఘం

6. రాజ్యాంగ హోదా లేని కమిషన్లు ఏవి?

జ:ప్లానింగ్ కమిషన్, జాతీయాభివృద్ధిమండలి. యూనివర్సిటీగ్రాంట్స్ కమిషన్, జోనల్ కౌన్సిల్స్

7. పూర్వం కన్యాకుబ్జం అని పిలిచే ప్రస్తుత ప్రాంతం?

జ: కనోజ్

8.'ఐ.సి.సి.ఐ.డి.డి.'ని విస్తరించండి? జ:ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్కంట్రోల్ ఆఫ్ అయోడిన్డెఫిషియన్సీ డిజార్డర్స్

9.. ఎన్.ఎం.డి., టి.ఎం.డి.అనగానేమి?

జ:నేషనల్ మిస్సైల్ డిఫెన్స్, థియేటర్ మిస్సైల్ డిఫెన్స్

10.. అబద్దాలు చెబుతున్నాడా లేదా అనే విష యాన్ని కనిపెట్టే పరీక్ష?

జ: లై డిటెక్టర్ పరీక్ష

11. అగ్ని ప్రమాదాల నివరాణ, మనుషులు గుంపులుగా చేరినపుడు వారిని నియంత్రించే రక్షణ వ్యవస్థ ఏది?

జ: హోమ్గార్డ్ ఫోర్స్

12..ఎల్.టి.టి.ఇ.నీ విస్తరించండి?

జ: లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ్ ఈలమ్ 13..ఎం.ఐ.ఎస్.ఎ. (మీసా) ను విస్తరించండి?

జ: మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్ 14.. 'వార్ అండ్ పీస్' గ్రంథకర్త ఎవరు?

జ: కౌంట్ లియో టాల్స్టాయ్

15.'విజయీ విశ్వతిరంగా ప్యారా' గేయం రచయిత?

జ: శ్యాంలాల్ గుప్తా పారద్

16.. 'ఆడ శిశుహత్యా నిషేధం చట్టం' చేసిన గ వర్నర్ జనరల్? జ: లార్డ్ హార్డింజ్

17..1929లో 'ఖుదాయే జీప్మత్గార్లు' (రెడ్ షర్ట్స్) ఉద్యమ స్థాపకుడు?

జ: సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్

18. భారతదేశంలో మొదటి హైటెక్ ఓడరేవు?

జ: ముంబైలోని నవశేవ పోర్టు

18.. చైనా డబ్ల్యూ.టి.ఓ.లో ఎప్పుడు ప్రవేశించింది? జ: సెప్టెంబర్ 18 2001న

19. జార్జిబుష్ ఏ పార్టీకి చెందినవారు? జ: రిపబ్లికన్ పార్టీ

20. 'సోల్ మౌంటెన్' గ్రంథ రచయిత? జ: గావో జింగ్ జియాన్

21. 'రాజతరంగిణి' గ్రంధకర్త ?

జ:కల్హణుడు

22. రామకృష్ణ మిషన్ ను వివేకానందుడు ఏ సంవత్సరంలో ప్రారంభించెను?

జ:1896

23. హోమ్రూల్ ఉద్యమంను ప్రారంభించినది. జ:అనిబిసెంట్

ఛ ఈ విభాగంలో గతంలో అడిగిన ప్రశ్నలు ఛ

1.ఆర్బీఐ ప్రస్తుత గవర్నర్ ఎవరు?

జ: సంజయ్ మల్హోత్రా.

2.26వ గవర్నర్.

3.అంతర్జాతీయ విద్యా దినోత్సవం ఏ రోజున జరుపు తారు?

జ: జనవరి 24

4.జాతీయ మహిళా దినోత్సవం?

జ: ఫిబ్రవరి 13

5.నాలుగో బౌద్ధమండలి ఛైర్మన్? జ: వసుమిత్రుడు గాంధార కళా పోషకులు ఎవరు? జ: కుషాణులు 6.సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తి ఎవరు?

జ: జస్టిస్ బీఆర్ గవాయ్.

7.2011లో అత్యంత జన సాంద్రత కలిగిన రాష్ట్రం ఏది?

జ: బిహార్

8.2024లో భారతరత్న పొందిన ఐదుగురు ఎవరు? జ: కర్పూరి ఠాకూర్, ఎల్కే అద్వానీ, పీవీ నరసింహారావు, చౌదరి చరణ్సింగ్, ఎంఎస్ స్వామినాథన్.

9.ఇండో పాకిస్థాన్ ఒప్పందాలు: 1960 సింధునది జలాల ఒప్పందం, 1972 సిమ్లా ఒప్పందం, 1966 తాష్కెంట్ ఒప్పందం.

**- డా.పి.వి.రామ్, ఎం.ఏ, బి.ఈడి, పి.హెచ్.డి**

**విశాఖ సమాచారమ్ 9553574250**

# అధికారుల నిర్లక్ష్యమా?



**తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):-** తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామంలో బస్టాండ్ ఎదురుగా ఉన్న నాలుగు రోడ్డుల కూడలికి కుడివైపు వీధిలో డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేక రోడ్డుపైకి మురికి నీరు ప్రవహిస్తున్నందున ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. డ్రైన్ లో నీరు కదలక పోవడం క్రిమి, కీటకాలు గుడ్లు పెట్టేసి, దోమల బెడద మరీ ఎక్కువగా ఉంది. రోడ్డు మొత్తం పల్లంగా ఏర్పడి బీటలు వాలి పగిలి పోవడం, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం కారణం చేత, చిన్నపిల్లలు, మహిళలు, చర్చికి వెళ్లేవారు ఆ నీటిగుండా నడవడం వలన వివిధ రకాల చర్మవ్యాధులు, దురదలు,ఇన్ఫెక్షన్ లు ఏర్పడుతున్నాయి.

ప్రభుత్వాలు మారుతున్న ఈ సమస్యకు పరిష్కారం ఇప్పటివరకు లేదు. అధికారులు వెంటనే స్పందించి ఆ వీధిలో నూతన రోడ్డు నిర్మించి ప్రజల ఇబ్బందులు, ఇక్కట్లు నుంచి తప్పించాలని ప్రజల వినతి.

2nd pages11.qxd 5/5/2025 9:08 PM Page 6



# శ్రీ నూకంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశాఖ, అనకాపల్లి జిల్లాల పట్టణ గ్రామీణ ప్రాంతాలు నుండి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో ఆలయానికి సమీపంలో ఉన్న తోటల్లో కుటుంబ సమేతంగా వంటలు వండుకుని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో. ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ సహాయ కమిషనర్ వెంపలి రాంబాబు, ఆలయ ధర్మకర్తలు సూరెసతీష్,దాడి రవికుమార్ పొలిమేర ఆనంద్, మారిశెట్టి శంకర్రావు, కాండ్రేగుల రాజారావు, మజ్జి శ్రీనివాసరావు, కొడుకుల శ్రీకాంత్, వడ్డాది మంగ,కోనేటి సూర్యలక్ష్మి ఎర్రవరపు లక్ష్మి , కోటమి నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవ్ టీజింగ్ చేసిన వ్యక్తిని పట్టుకున్న శక్తి టీమ్

## కౌన్సిలింగ్ నిర్వహించి కఠిన హెచ్చరికలు



**కశింకోట, (విశాఖ సమాచారమ్):-** మహిళల భద్రతను ప్రాధాన్యంగా తీసుకుంటూ, అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మార్గదర్శకత్వంలో డిఎస్పీ శ్రీమతి ఎం.శ్రావణి పర్యవేక్షణలో ఏర్పాటైన శక్తి టీమ్‌లు మహిళలపై వేధింపులు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలపై వేగంగా స్పందించేందుకు కట్టుబడి ఉన్నాయి.ఇటీవల, తాళ్ళపాలెం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థిని శక్తి టీమ్‌కు ఫిర్యాదు చేసింది.ఆమె తెలిపిన ప్రకారం, కశింకోట మండలం, తేగాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తరచూ తనను ఈవ్ టీజింగ్ చేస్తున్నాడని విన్నవించింది.

ఈ సమాచారం అందిన వెంటనే, శక్తి టీమ్ ఇన్‌చార్జ్ ఎస్సై పి.మనోజ్ కుమార్ నేతృత్వంలో హెచ్.సీ మల్లీశ్వరి, పి.సి దీపిక, పి.సి కొండలరావు, పి.సి అప్పలాచార్య, పి.సి నాయుడు వంటి పోలీసు సిబ్బంది వెంటనే స్పందించి, సంబంధిత వ్యక్తిని గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అక్కడ అతనికి చట్టపరమైన శిక్షల గురించి వివరించి, కౌన్సిలింగ్ నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి చర్యల వల్ల ఎదురయ్యే తీవ్ర పరిణామాల గురించి హెచ్చరికలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ఎటువంటి భయాలకు లోను కాకుండా శక్తి యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేస్తే, వెంటనే మా శక్తి టీమ్స్ ద్వారా తక్షణ చర్యలు తీసుకుంటామని బాధితులకు భరోసా తెలిపారు.మహిళల భద్రత విషయంలో ఎటువంటి రాజీ లేదు.శక్తి టీమ్ ఎల్లప్పుడూ బాధితుల పక్షంలో నిలుస్తుంది" అని శక్తి టీమ్ సభ్యులు పేర్కొన్నారు.

# పి.జి.ఆర్.ఎస్. అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలి

## అర్జీల పరిష్కారం పై సిబ్బందికి శిక్షణ అందించాలి : జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో వచ్చే అర్జీలపై సకాలంలో చర్యలు తీసుకోవాలని, అర్జీకి సరైన వివరణతో సమాధానం యివ్వాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో జిల్లా విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో ప్రజల నుండి తీసుకున్న అర్జీల పరిష్కారం గూర్చి సంబంధిత జిల్లా అధికారులు, నియోజకవర్గ మరియు మండల ప్రత్యేక అధికారులకు ఆదేశాలు జారీచేసారు. పి.జి.ఆర్.ఎస్. పెండింగు అర్జీలపై జిల్లా కలెక్టరు శాఖల వారీగా సమీక్షచేసారు. అర్జీల పరిష్కార ప్రక్రియపై ప్రతి శాఖ అధికారులు, సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, అర్జీలో తెలిపిన సమస్యకు సంబంధించి వివరణ స్పష్టంగా తెలపాలని, అర్జీదారునికి సమస్య పరిష్కారం గూర్చి అర్ధమయ్యేవిధంగా తెలియ జేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి రవీంద్ర పర్యటన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన లో బాగంగా జిల్లా లోని పెందుర్తి నియోజకవర్గం వేపగుంటలో విఎంఆర్‌డిఎ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం పనుల్ని మంత్రి కొల్లు రవీంద్ర పరిశీలించారు. నిర్మాణ స్థితి గురించి అధికారులను అడిగి తెలుసుకునీ,13 సంవత్సరాలుగా నిర్మాణం జాప్యం అవుతూ రావడం బాధాకరమని, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులో ఉంచుతామని మంత్రి హామీ ఇచ్చారు.వేపగుంట పరిధిలో 20వేల చదరపు అడుగుల స్థలంలో ప్రజల కోసం నిర్మించడం అభినందనీయమని నియోజక వర్గాల్లోని సమస్యల పరిష్కారానికి కూటమి ముందుంటుంది అని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం అని,వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆధికారులను ఆదేశించాం అని తెలిపారు.స్తానిక రోడ్డు నిర్మాణ పనులను కూడా పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడుతానని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా అనకాపల్లిలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నాం అని,రాష్ట్ర అభివృద్ధి సాధించాలంటే క్షేత్ర స్థాయిలో అభివృద్ధి అత్యంత అవసరం అని ఆయన తెలిపారు.

# ఘనంగా రిత్విక్ జన్మదిన వేడుకలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.యం.రమేష్ తనయుడు, యువ పారిశ్రామికవేత్త, యువనాయకుడు రిత్విక్ జన్మదిన వేడుకలు జనసేన పార్టీ యువజన నాయకుడు కోరిబిల్లీ పరి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో ఘనంగా జరిగాయి.. ఈ సందర్భంగా వైద్యాలయం సిబ్బందికి అల్పాహారం అందజేశారు. ఎన్టీఆర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్ ఇంచార్జ్ డాక్టర్ కనకదుర్గ చేతుల మీదుగా అల్పాహారం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గేదెల స్వరూప్ (బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ) బీజేపీ యువజన నాయకులు చదరం సూరి అప్పారావు,మొగ్గ మురళి కృష్ణ, కోట్ని సాయి. ఎల్లపు శేషు, శ్రీను హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా భగీరథ మహర్షి జయంతి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):** భగీరథ మహర్షి జయంతి ని ఆదివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు భగీరథ మహర్షి చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతిప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథుడు దీక్షకు, సహనానికి ప్రతిరూపమని, ఎంత కష్టమైనా లెక్కచేయకుండా, అనుకున్నది సాధించారని దివినుండి భువికి గంగను తీసుకువచ్చారని తెలిపారు. అందుకే కష్టాన్ని లెక్కచేయకుండా, అనుకున్నది సాధించే వారిని భగీరథునితో పోలుస్తారన్నారు. భగీరథుని స్పూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరు జీవితంలో లక్ష్యాన్ని చేరుకొనుటకు ప్రయత్నం చేయా లని, అపజయాలకు భయపడకుండా ప్రయత్నం చేయాలని, కష్ట పడితే తప్పకుండా ఫలితం వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి కె. రాజేశ్వరి మాట్లా డుతూ భగీరథుడు పట్టుదలకు, ప్రయత్నానికి ప్రతిరూపమని తెలిపారు. భగీరథ వారసులైన ఉప్పర కులానికి చెందిన వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బీసీ కార్పొరేషన్ ద్వారా వారికి రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గవర కార్పోరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, గవర్ కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరిక్రిష్ణ, ఇన్చార్జి ఏవో వాసు నాయుడు,ఉప్పర మరియు సగర కమ్యూనిటీ అధ్యక్షులు నక్క పెంటయ్య మరియు సభ్యులు,బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# పూడికతీత పిచ్చి మొక్కలు తొలగింపు



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** నాతవరం మండలం మర్రిపాలెంపంచాయతీ లో వెర్రిగెడ్డ రిజర్వాయర్ వద్ద పూడికతీత మరియు జంగిల్ క్లియరెన్స్ పనులు ను నాతవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నందిపల్లి వెంకటరమణ చెరువు చైర్మన్ రంబా సత్యనారాయణ, రిజర్వేయర్ చైర్మన్ అల్లు స్వామి నాయుడు,పెట్ల జ్యోతి ,తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విరబూసిన బ్రహ్మ కమలాలు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో ప్రభుత్వం ఉద్యోగి ఇంటి వద్ద బ్రహ్మ కమలం పువ్వులు విరబూసాయి, సమాచారం శాఖ అధికారి ఇంటి వద్ద బ్రహ్మ కమలం పువ్వులను చూసేందుకు ఈ ప్రాంత వాసులు ఎగబడ్డారు.

# తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక



**నాతవరం, (విశాఖ సమాచారమ్):-** మండలం లోని మన్యపురట్ల పంచాయతీ తెలుగుదేశం పార్టీ గ్రామ పార్టీ అధ్యక్షులుగా పుణ్యమంతుల బాబ్జీ ని పంచాయతీ టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నికొన్నారు.ఈ కమిటీ ఎన్నికకు ముఖ్య పరిశీలకులుగా తాండవ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ 'కరక సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు 'నందిపల్లి వెంకటరమణ'ఇరువురు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో తెలియజేసిన పార్టీ నాయకులు మాజీ సర్పంచులు, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు,తదితరులు పాల్గొన్నారు.

# నిర్వాసితుల కాలనీల స్థల సేకరణ వేగవంతం చేయండి

## కట్టడాల విలువ నిర్ధారించండి : జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు కాలనీలు నిర్మించడానికి రంపచోడవరం, రాజవొమ్మంగి, గంగవరం, అడ్డతీగల మండలాలలో గుర్తించిన స్థల పరిశీలన వేగవంతం కావాలని, ఆయా స్థలాలు గృహనిర్మాణాలకు అనువుగా ఉన్నది, లేనిదీ పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ, అవసరమైన చోట భూమికి బదులు భూమి ఇవ్వటానికి గల అవకాశాలు పరిశీలించాలన్నారు. అదేవిధంగా విఆర్ పురం, ఏటపాక, చింతూరు, కూనవరం ముంపు ప్రాంతాలలో ఉన్న స్ట్రక్చర్స్ పరిశీలించి వాటి విలువ నిర్ధారించాలని ఆదేశించారు. ఆయా మండలాలలో 4746 స్ట్రక్చర్స్ గుర్తించడం జరిగిందని, ఇప్పటి వరకు 3252 స్ట్రక్చర్స్ కు మాత్రమె విలువ కట్టడం జరిగిందని, మిగిలిన స్ట్రక్చర్స్ ను త్వరగా పరిశీలించి విలువ నిర్ణయించాలని ఆదేశించారు. మరో 324 స్ట్రక్చర్స్ విలువ పున: పరిశీలించాలని ఆదేశించారు.ఈ వేదియో కాన్ఫరెన్స్ లో క్యాంప్ కార్యాలయం నుండి పర్యవేక్షకులు తిరుమల రావు, చింతూరు నుండి ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, సబ్ కలెక్టర్, ఆర్ అండ్ ఆర్ అధికారులు తదితరులు, ఇంజనీరింగ్ అధికారులు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కడుపుబ్బా నవ్వించిన నవ్వుల నజరానా



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా అనకాపల్లి లాఫింగ్ క్లబ్ స్థానిక గవరపాలెం శ్రీ మళ్ళ జగన్నాథం కళ్యాణమండపంలో నిర్వహించిన నవ్వుల నజరానా కార్యక్రమం ప్రేక్షకులను అధ్యంతం అలరించింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసిన జబర్దస్త్ సత్తిపండు ఎఫ్ఎం బాబాయ్ హాస్య ప్రియులందరినీ నవ్వించారు.అనంతరం అనకాపల్లి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో పోలమరశెట్టి ప్రవీణ్ కుమార్ సారధ్యంలో విశాఖకు చెందిన ఏఏఏ ఎంటర్టైన్మెంట్స్ కళాకారులు ప్రదర్శించిన స్కిట్స్ ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. లాఫింగ్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దాడి వాసు, బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కాండ్రేగుల శ్రీరామ్ ఫ్యూచర్ వరల్డ్ స్కూల్ అధినేత డాక్టర్ వెంకట పార్వతీశం పాల్గొని కళాకారులను సత్కరించారు. అలాగే ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా ప్రముఖ జబర్దస్త్ కమెడియన్ సత్తిపండును డైరెక్టర్స్ డే సందర్భంగా ఆరు ఇంటర్నేషనల్ అవార్డులు పొందిన దహనం సినిమా దర్శకులు ఆడారి మూర్తి ని లాఫింగ్ క్లబ్ టీం ఘనంగా సత్కరించింది.ఈ కార్యక్రమంలో లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపకులు వినకోట బుచ్చిరాజు ముఖ్య ప్రోత్సాహకులు కొణతాల పూర్ణచంద్రరావు, క్లబ్ కోశాధికారి రాపేటి నారాయణరావు, విల్లూరి సంతోష్ కుమార్ , వుద్దగిరి శ్రీనివాసరావు భీమరశెట్టి వరాహ దాడి సూరిబాబు దావన్ తదితరులుపాల్గొన్నారు. కార్యక్రమంలో. విల్లూరి గగన సరయు అనే చిన్నారి చేసిన దుర్యోధనుని ఏకపాత్రాభినయం ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# సమరసత సేవ ఫౌండేషన్ మండల సమావేశం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** పరవాడ సినిమా హాల్ జంక్షన్ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో పరవాడ సబ్ డివిజన్ కన్వీనర్ మల్లిమడుగుల నాగపేర్రాజు మాట్లాడుతూ ఈ నెలలో మండలం సభ్యులు ఒకొక్కరు రెండు పంచాయతీలలో దేవాలయం కేంద్రంగా భజన, సత్సంగము సామూహిక హారతి కార్యక్రమం జరిగే విధంగా భాధ్యత. తీసుకోవాలని అన్నారు . ప్రతీ పంచాయతీ గ్రామంలో నెలకు ఒక్కసారి దేవాలయం కేంద్రంగా ధార్మిక జట్టు సమావేశం ఏర్పాటు చేసి ఆ గ్రామంలో అన్ని దేవాలయం కేంద్రంగా భజన సత్సంగము సామూహిక హారతి జరిగే విధంగా ప్రయత్నం చేయాలని అన్నారు . ఈనెల 22 తేదీన హనుమాన్ జయంతి కార్యక్రమం ప్రతీ దేవాలయం కేంద్రంగా చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మండల సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు, మండలం మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, మహిళా సహా కన్వీనర్ బొద్దపు నూకరత్నం, యమ్ హైమవతి, మండల సభ్యులు పెదపాటి రామచంద్రరావు, దేముడు, సత్యనారాయణ,, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నెలకు రూ.3,000 పింఛన్

## ప్రధానమంత్రి మాన్‌ధన్ యోజనతో వృద్ధాప్యంలో ఆర్థిక భరోసా

**విశాఖ సమాచారమ్ డెస్క్:** చిన్న, సన్నకారు రైతులకు వృద్ధాప్యంలో పింఛన్ అందించి ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మాన్‌ధన్ యోజనను అమలు చేస్తోంది. 60 సంవత్సరాల వయస్సు పైబడిన రైతులకు ప్రతి నెలా రూ.3,000 చొప్పున జీవితకాలం పింఛన్ అందనుంది. 18 నుంచి 40 ఏళ్ల వయసున్న వారు పథకానికి అర్హులు. 5 ఎకరాల్లోపు సొంత వ్యవసాయ భూమి కలిగిన అన్నదాతలు, పీఎం కిసాన్ లబ్ధిదారులు తమ వివరాలు నమోదు చేసుకోవచ్చు. అయితే పన్ను చెల్లింపుదారులు, ఉన్నతమైన ఆర్థిక స్థితి కలిగి, సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్న వారికి ఈ స్కీమ్ వర్తించదు.

**ప్రీమియం ఇలా చెల్లించొచ్చు :**

18 నుంచి 40 ఏళ్ల వయసున్న రైతులు ప్రతి నెలా 55 నుంచి 200 రూపాయల వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 18 సంవత్సరాల వయసున్న రైతు నెలకు 55 రూపాయలు చెల్లిస్తే కేంద్రం తన వాటాగా మరో రూ.55 కలిపి మొత్తం రూ.110 జమ చేస్తుంది. 20 ఏళ్ల వయసున్న రైతులు రూ.61 చెల్లించాలి. 25 ఏళ్ల వారికి 80 రూపాయలు, 30 ఏళ్ల వారికి 105 రూపాయలు, 35 ఏళ్లకు 150 రూపాయలు, 40 ఏళ్ల వారు 200 రూపాయలు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 60 ఏళ్ల తర్వాత ప్రీమియం చెల్లిస్తున్న రైతు మరణిస్తే నామినీగా ఉన్న భార్యకు నెలానెలా రూ.1,500 పింఛను జీవిత కాలం అందుతుంది.

**దరఖాస్తు ఇలా...**

పీఎం కిసాన్ లబ్ధిదారులు సీఎస్‌సీ సెంటర్కి వెళ్లి పీఎం కిసాన్ కేఎంవై ( పీఎం కేఎంవై) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

రైతు మొదట తన ఆధార్ నంబర్, తర్వాత నామినీ వివరాలు రిజిస్టర్ చేయాలి.

మాన్‌ధన్ అప్లికేషన్ను డౌన్‌లోడ్ చేసుకుని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. అప్పుడు పీఎం కిసాన్ మాన్‌ధన్ పింఛను కార్డు వస్తుంది.

పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంకు అకౌంట్ నుంచి ప్రీమియం నగదును చెల్లించాలి.

పీఎం కిసాన్ లబ్ధిదారులు కానట్లయితే సీఎస్-సీలో దరఖాస్తు చేసుకుని పింఛన్ కార్డును డౌన్‌లోడు చేసుకోవచ్చు.ఇది సన్నకారు రైతులకు వరంగా మారనుంది

# 8 న జరిగే తలసేమియా రన్ విజయవంతం చేయాలి

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు అండగా నిలిచేందుకు ఎన్ టి ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 8 న విశాఖ బీచ్ రోడ్ లో జరిగే తలసేమియా రన్ ను విజయవంతం చేయాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ కోరారు. గురువారం సాయంత్రం 6 గంటలకు ఆర్ కె బీచ్ నుంచి జరిగే ఈ తలసేమియా రన్ లో నగరవాసులు, స్వచంద సంస్థల ప్రతినిధులు, మహిళలు, క్రీడా కారులు , యువత పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొనాలని కోరారు.

## 7న వాసవిమాత జన్మదిన మహోత్సవం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** పట్టణంలో 100 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7 బుధవారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మదిన మహోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆలయ అధ్యక్షులు బిల్లపాటి కృష్ణకుమార్ తెలియజేశారు. ఆరోజు ఉదయం అమ్మవారి పల్లకి ఊరేగింపు, తిరువీధి మహోత్సవం, గోపూజ శ్రీనగరేశ్వర స్వామి, శ్రీజనార్ధన్ స్వామి వారికి అభిషేకాలు అర్చనలు, ఆలయ మండపంలో అమ్మవారు ఉత్సవ మూర్తికి భక్తులు చే బియ్యంతో అభిషేకం, అమ్మవారికి లక్ష మల్లెపూలతో అర్చన, సామూహిక లలిత సహస్రనామం పారాయణం, అన్న సమారాధన, వాసవి మాతకు 102 రకాల స్వీట్లు తో నైవేద్యం, అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ చుట్టూ వెండి రథం పై ఊరేగింపు, ఊంజల్ సేవ, కోలాటము, కార్యక్రమాలు జరుగుతాయి . కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు,తెలియజేశారు.

## గిరిజనులపై ఆర్టీసీ చిన్న చూపు తగదు



**జి.మాడుగుల, (విశాఖ సమాచారమ్):-** ఎన్ని ప్రభుత్వాలు మారిన ఉమ్మడి విశాఖ అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రజల పట్ల ఆర్టీసీ యాజమాన్యం చిన్నచూపు చూస్తుందని అల్లు జిల్లా వైఎస్ఆర్ పార్టీ యూత్ అధ్యక్షులు గబ్బడి శేఖర్ ఆరోపించారు. అందుకు ఉదాహరణ జి మాడుగుల మండలమే కారణమని ఆయన అన్నారు. జి మాడుగుల మండలంలో 17 పంచాయతీలు ఉండగా పది పంచాయతీలకు ఆర్టీసీ రవాణా లేదని గతంలో ఉన్న బస్సు సౌకర్యాలు కూడా రద్దు చేశారని ఆయన అన్నారు. అందుకు సొంగు లోయ,గడుతురు,వంతల మార్గాలలో బస్సు సౌకర్యాలు రద్దు కారణమని ఆయన అన్నారు. బస్సు సౌకర్యం రద్దు చేయడం వలన వంతల, పెద్దలోచలి, సోలభం, గడుతురు, గెమ్మెలి, పేద లువ్వసింగి, కోరాపల్లి, నుర్మతి తో పాటు చింతపల్లి మండలాల లోని తమింగుల, కిలుమునింగి తో పాటు పలు పంచాయతీల ప్రజలకు రమణా సౌకర్యం స్తంభించిపోయిందని ఆయన అన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి , ప్రమాదాలకు గురై ప్రాణాలను పోగొట్టుకొని ఆస్పత్రి పాలవుతున్నారని ఆయన అన్నారు. అలాగే జి మాడుగుల చింతపల్లి పాడేరు మండల ప్రజలకు ఎంతో సౌకర్యం ఉండే విశాఖపట్నం జి.మాడుగుల నైట్ హాల్ లగ్జరీ బస్సు సర్వీస్ ని కూడా ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ఏం మార్గంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేలా కృషి చేయాలని ఆయన కోరారు.

## విశాఖలో విషాదం

### స్కూటీపై వెళుతున్న మహిళ స్పాట్‌లో మృతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఏపీలో భారీ వర్షాల కారణంగా విశాఖలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న మహిళపై చెట్టు విరిగి పడిపోవడంతో సదరు మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. దీనికి సంబంధించిన వీడియో బయటకు వచ్చింది.

వివరాల ప్రకారం.. విశాఖలోని సీతమ్మధారలో విషాదం నెలకొంది. సితార అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న పూర్ణిమ (38) ఈరోజు ఉదయం తన స్కూటీపై రోడ్డు మీద వెళ్తోంది. ఈ సందర్భంగా ఆమెపై చెట్టు విరిగి పడిపోయింది. ఈ ఘటనలో బాధితురాలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ప్రమాదంలో కారు, బైక్ సహా ఇతర వాహనాలు దెబ్బతిన్నాయి. ఇక, సమాచారం అందిన వెంటనే పోలీసులు, మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మహిళ మృతి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు.

## పీతల మూర్తి యాదవ్‌పై చర్యలకు డిమాండ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** పిఠాపురం కాలనీలోని వాంబే గృహ గోడ కూల్చడంపై రజకుల సేవా సంఘం వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం నిరసన చేపట్టారు. గోడ కూల్చివేతకు సంబంధించి టౌన్ ప్లానింగ్ సిబ్బందిని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పంపించాడని ఆరోపిస్తూ.. జనసేన పార్టీ అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద ప్రజలపై మూర్తి యాదవ్ దౌర్జన్యం చేస్తున్నాడని మండిపడ్డారు. పిఠాపురంకాలనీలో ప్రభుత్వం ఇచ్చిన వాంబే గృహాల్లో ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నామన్నారు. పీతల మూర్తిని స్థానికులు పట్టించుకోకపోవడంతో వార్డు ప్రజలపై దౌర్జన్యం మొదలుపెట్టాడని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగా ప్రహరీని విరగొట్టించాడని దుమ్మెత్తి పోశారు. అతని దగ్గర నాలుగేళ్లుగా లంచం తీసుకుని పనిచేస్తున్న టౌన్ ప్లానింగ్ సెక్రటరీ జ్యోతిని పంపి.. ఈ పని పూర్తి చేయించాడని ఆరోపించారు. వార్డు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న పీతల మూర్తిపై పవన్ కల్యాణ్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అతని నుంచి 22వ వార్డు ప్రజలను కాపాడాలని కోరారు.

# మన్యం యోధుడు మర్రి కామయ్య వర్ధంతి

### మర్రి కామయ్య విగ్రహానికి పెదబయలు మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు



**జి.మాడుగుల/పెదబయలు, (విశాఖ సమాచారమ్):-** మర్రి కామయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పెదబయలు మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మన్యం యోధుడు మర్రి కామయ్యను గుర్తు చేసుకుంటూ పలువురు వర్తలు మాట్లాడుతూ భారత స్వతంత్రానికి ముందు ఆ తరువాత గిరిజన ప్రాంతంలో జరిగిన అనేక ఉద్యమాల్లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తర్వాత రెండవ మన్యం యోధుడుగా పేరుగాంచిన మర్రి కామయ్య ముఠాదారుల ఆగడాలకు వ్యతిరేకంగా, అధిక పన్నులు దోపిడి నివారించాలని, గిరిజనులు పండించే వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని దళారులు చేస్తున్న మోసాలను ఎండగడుతూ చెడు వ్యసనాల నుండి గిరిజనులకు విముక్తుల్ని చేస్తూ ప్రభుత్వ,పెత్తందారుల దోపిడి విధానాలపై అవగాహన పరుస్తూ అనేక పోరాటాలు చేశారు. ఇది చూసి ఓర్చుకోలేని ముఠా దారులు ప్రభుత్వంతో కలిసి పోలీసులతో మర్రి కామయ్య కుటుంబ సభ్యులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. అంతేకాకుండా కామయ్య ఆస్తులను పశువులను భూములను స్వాధీనం చేసుకుని భయాందోళనల వాతావరణాన్ని సృష్టించారు, మరి కామయ్య గ్రామాన్ని తగలబెట్టారు,అయినా మరి కామయ్య భయపడకుండా అడవుల్లో తలదాచుకొని సుమారు 50 కి పైగా దలాలను తయారు చేసుకొని ప్రభుత్వ ఆకృత్యాలకు వ్యతిరేకంగా గిరిజనులకు జరిగే మోసాలను పాతరిస్తూ ఉద్యమం సల్పిన వీరుడు మర్రి కామయ్య అని అన్నారు.ప్రస్తుత పాడేరు రెవెన్యూ డివిజన్ హుకుంపేట మండలం తీగలవలస పంచాతి గరుడ పల్లి గ్రామంలో జన్మించి 1959 వరకు ఆదివాసీల కోసం అనేక పోరాటాలు చేసి ప్రాణాలర్పించిన యోధుడు మరి కామయ్య అని కొనియాడారు. ఇటువంటి మహానీయుల యొక్క స్ఫూర్తిని తీసుకొని భవిష్యత్తులో ప్రతి ఒక్కరు జాతి ఐక్యత అభివృద్ధి కొరకై పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండల అభివృద్ధి అధికారి అయిన ఎల్. పూర్ణయ్య, మండల తహసిల్దారు జి. రంగారావు,వైస్ ఎంపీపీ కొర్ర రాజు బాబు వారి యొక్క సిబ్బందితోపాటు తెలుగుదేశం పార్టీ పెదబయలు మండల అధ్యక్షులు సీకరి సుకుమారి,తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాంగి నాగేశ్వరరావు,సీతగుంట మాజీ సర్పంచ్ తైసాబు త్రినాథ్, తెలుగు రైతు సంఘం అరకు ఉపాధ్యక్షులు కూడా భూషణ్ రావు, తెలుగుదేశం పార్టీ జిల్లా నాయకులు కొమ్మ పృథ్వీరాజ్,అరకు నియోజకవర్గ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు చల్లంగి రవికుమార్,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లకే రాజు,లకే రామణ దొర, సీకరి వెంకటరమణ, బత్తిరి రామారావు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

## నూతన అధ్యక్షులుగా నమ్మి శ్రీను



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** చోడవరం మాడుగుల జర్నలిస్ట్ సంక్షేమ సంఘం (ప్రెస్ క్లబ్) నూతన కార్యవర్గ నూతన అధ్యక్షుడిగా నమ్మి శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని వడ్డాది స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద చోడవరం మాడుగుల జర్నలిస్టుల సంక్షేమ సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఈ జర్నలిస్టు సంక్షేమ సంఘానికి నూతన అధ్యక్షుడిగా అనకాపల్లి టుడే దినపత్రిక ఎడిటర్ నమ్మి శ్రీను ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు నమ్మి శ్రీను మాట్లాడుతూ యూనియన్ బలోపేతానికి, అభివృధి, సంక్షేమానికి జర్నలిస్ట్ ల సమస్యలు పరిష్కరానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. పాత్రికేయులు ఆరోగ్యం నిమిత్తం హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్ కల్పిస్తానని అలాగే ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాల సమస్య ను ప్రభుత్వం దృష్టి కి తీసుకువెళ్లి ఇళ్ల స్థలాల మంజూరు కి కృషి చేస్తానని అన్నారు. తనను గుర్తించి నమ్మకముంచి తనను బలపరిచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న యూనియన్ సభ్యులు కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం యూనియన్ సభ్యులు శరగడం రాజు, రేణం సోమినాయుడు, కెటి నాయుడు, ఎం. మోహన్, వాసు, నాగేష్, యు.. తాతారావు, ఎన్. అజయ్ ప్రసాద్, ఎం. గోవింద్, పాండు, కె. చంద్రరావు, ఎస్. గణేష్, ఆర్. నాగేష్, టి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటులో 'ఉచితం' అందేనా..!

విశాఖ విద్య : ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఉచితంగా అందించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 2025%-%26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర సిలబస్‌తో పాటు ఐబీ/ఐసీఎస్ఈ/సీబీఎస్ఈ బోధన అందిస్తున్న జిల్లాలోని 621 ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమీక్షిస్తున్నారు. అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్ ద్వారా లేదా సమీపంలోని సచివాలయాల్లో అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**మొండికేస్తున్న ప్రైవేటు యాజమాన్యాలు**

ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు ఉచితంగా పేద విద్యార్థులకు ఇచ్చే క్రమంలో గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్ల పూర్తి వివరాలను కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో పొందుపరచాలి. అయితే జిల్లాలోని కొన్ని ప్రైవేటు స్కూళ్ల వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు కాలేనట్లుగా తెలుస్తోంది. గతంలో ఫీజులు పెండింగ్ ఉన్నాయంటూ కొన్ని యాజమాన్యాలు కో ర్టును సైతం ఆశ్రయించినట్లుగా తెలుస్తోంది. నగరంలో క్రేజ్ ఉన్న స్కూళ్ల యాజమాన్యాలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నాయి.

**వైఎస్సార్‌సీపీ హయాంలో పకడ్బందీగా అమలు**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో పేద విద్యార్థులకు ఉచిత విద్యను పకడ్బందీగా అమలు చేశారు. 2022%-%23లో 86 మంది, 2023%-%24లో 1,227 మంది, 2024%-%25లో 2,989 మంది ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఉచిత సీట్లు కేటాయించిన పాఠశాలలకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ఫీజులను పాఠశాల యాజమాన్యాలకు చెల్లించేందుకు ఒప్పందం కుదిరింది. కూటమి ప్రభుత్వం గత ఏడాది, ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన



ఫీజు బకాయిలను చెల్లించకపోవడంతో జిల్లాలోని చాలా పాఠశాలల యాజమాన్యాలు ఉచిత సీట్లు ఇచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఈ నేపథ్యంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఎంత మంది ఉచిత విద్యను పొందుతారనేది వేచి చూడాల్సి ఉంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

విద్యాహక్కు చట్టం మేరకు గుర్తింపు ఉన్న ప్రైవేటు స్కూళ్లలో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు ఇవ్వాలి. దీన్ని అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలి. ఉచిత విద్య ప్రవేశాలపై ప్రతీ రోజూ డీఈవోల పర్యవేక్షణలో మండలాల వారీగా సమీక్షిస్తున్నాం.

**బి.విజయ్ భాస్కర్, ఆర్జేడీ**

**సచివాలయాల వారీగా సమీక్ష**

పేద విద్యార్థులకు ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం సీట్లు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాలో గుర్తింపు గల స్కూళ్లు కచ్చితంగా వెబ్‌సైట్‌లో నమోదయ్యేలా దృష్టి పెట్టాం. సచివాలయాల వారీగా దీనిపై సమీక్షిస్తున్నాం. అర్హులంతా గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి.

**డాక్టర్ జె.చంద్రశేఖర్ రావు,**
**ఏపీసీ, సమగ్ర శిక్ష, విశాఖ జిల్లా**

## ఎస్ ఈ జెడ్ పరిశ్రమల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు : సిఐటియు



**అచ్యుతాపురం, (విశాఖ సమాచారమ్):-** ఈనెల 20వ తేదీన లేబర్ కోడ్ లు రద్దు ,కనీస వేతనాలు అమలు కొరకు మే 20న దేశవ్యాప్త సమ్మె లో ఎస్సీ జడ్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని, అధిష్టాన్, పిల్ కింగ్టన్ ,విన్ విన్ , పోకర్ణ పరిశ్రమ యాజమాన్యాలకు సిఐటియు సమ్మె నోటీసులు అందజేయడం జరిగింది. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్ర బిజెపి మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్ లు తెచ్చింది వీటిని రద్దు చేయాలని కనీస వేతనం 26,000 ఇవ్వాలని ,ఈ సమ్మె లేబర్ కోడ్ లు అడ్డుకోవడం కార్మికుల కర్తవ్యం అని లేబర్ కోడ్ లు అమల్లోకి వస్తే చట్టాలు వర్తించే కార్మికులు చట్టాలు వర్తించని కార్మికులందరూ బానిసత్వంలోకి నెట్టబడతారు అందుకోసం 20వ తేదీన జరిగే సమ్మెలో అఖిలభారత కార్మికులు ,రైతులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, సిఐటియు అచ్చుతాపురం మండల కన్వీనర్ కె .సోము నాయుడు సిఐటియు నాయకులు బ్రహ్మాజీ పాల్గొన్నారు.

# విజయవాడకు కొత్త సైనిక్ స్కూల్

## ఈ ఏడాది నుంచే అడ్మిషన్లు

**విజయవాడ, (విశాఖ సమాచారమ్):-** విజయవాడకు సమీపంలో కేతనకొండలో కొత్తగా సైనిక్ స్కూల్ రాబోతోంది. జూన్ నెల నుంచి ఐదు, ఆరో తరగతిలో అడ్మిషన్లు ప్రారంభం కాబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో విజయనగరం జిల్లా కోరుకొండ, చిత్తూరు జిల్లా కలికిరి, నెల్లూరు జిల్లా కృష్ణపట్నం సమీపంలో సైనిక్ స్కూళ్లు ఉన్నాయి. తాజాగా విజయవాడ సమీపంలోని కేతనకొండలో నాలుగోది ఏర్పాటు కానుంది. విద్యాభారతి ఆధ్వర్యంలో నేతాజీ సైనిక్ స్కూలు పేరుతో దీనిని ఏర్పాటు చేయబోతున్నట్లు విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నేతాజీ సైనిక్ స్కూల్ సొసైటీ కార్యనిర్వాహక కార్యదర్శి లింగం సుధాకర్ రెడ్డి చెప్పారు. సైనిక్ స్కూల్ ఏర్పాటుకు సంబంధించిన బ్రోచర్లను స్థల, భవన దాత చలసాని బాబూ రాజేంద్రప్రసాద్, నేతాజీ సైనిక్ స్కూల్ సొసైటీ కార్యదర్శి వాసిరెడ్డి వినోద్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ సీఎల్ వెంకట్రావుతో కలిసి ఆవిష్కరించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని 67 శాతం మందికి స్థానిక కోటా కింద ఈ పాఠశాలల్లో ఇస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు చెప్పారు. ఆరో తరగతిలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఆలిండియా సైనిక్ స్కూల్ ఎగ్జామినేషన్ ఏప్రిల్ 5వ తేదీన నిర్వహించిన పరీక్షల్లో అర్హత పొందిన విద్యార్థులకు అవకాశం ఉంటుందని చెప్పారు. జూన్లో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు రాజ్నాథ్ సింగ్, బండి సంజయ్ చేతులమీదుగా నేతాజీ సైనిక్ స్కూల్ ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల వేదికలో 32 ఫిర్యాదులు స్వీకరణ

### సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశాలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 32 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ వివాదాలు తదితర అంశాలు ఉన్నాయి అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ వేదికలో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, స్వయంగా హాజరై, ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వారితో ప్రత్యక్షంగా మాట్లాడారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులకు తక్షణమే విచారణ చేపట్టి చట్టపరమైన పరిష్కారం అందించాలని సూచించారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా పరిష్కరించడానికి పోలీసు శాఖ కట్టుబడి ఉంది. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చర్యలు తీసుకుంటాం,అని ఎస్పీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు,ఇన్స్పెక్టర్ లు బాల సూర్యరావు, అప్పలనాయుడు మరియు ఎస్సై వెంకన్న మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో 4 బంగారు పతకాలు




**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** ఈనెల 3 మరియు 4 తేదీలలో కేరళలోని ఎర్నాకుళం లో జరిగిన 4వ జాతీయ పాన్ ఇండియా మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన పీవీఎం నాగజ్యోతి 4 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ పోటీలలో 300 మంది క్రీడాకారులు పాల్గొనగా, పురుషులకు, మహిళలకు వేరువేరు విభాగాలలో పోటీలు నిర్వహించారు. మహిళల విభాగంలో పాల్గొన్న నాగజ్యోతి బెంచ్ ప్రెస్, డెడ్ లిఫ్ట్, పవర్ లిఫ్టింగ్ విభాగాలు మూడింటిలోనూ మొదటి స్థానంలో నిలిచి 3 బంగారు పతకాలు సాధించారు. ఓవర్ ఆల్ ఛాంపియన్షిప్ లో మరో బంగారు పతకం తో కలిపి మొత్తం నాలుగు బంగారు పతకాలు నాగజ్యోతి సాధించారు. పాన్ ఇండియా మాస్టర్స్ సంస్థ అధ్యక్షులు దీపు దేవ్, మిస్టర్ ఇండియా టైటిల్ విన్నర్ వి ఎన్ షాజీ చేతుల మీదుగా బంగారు పతకాలు, ధ్రువపత్రాలను నాగజ్యోతి అందుకున్నారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ, కఠోర శ్రమ, దీక్ష, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించ వచ్చని ఆమె తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక మెడల్స్ అందుకున్నానని, ఈ తాజా విజయంతో భవిష్యత్తులో మరిన్ని విజయాలే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. కాగా ప్రస్తుతం ఈమె అనకాపల్లి జిల్లా రోలుగుంట హై స్కూల్ లో ఆంగ్ల ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

## ముగిసిన డిపిఎల్ క్రికెట్ టోర్నీ పోటీలు



**దేవరాపల్లి (విశాఖ సమాచారమ్):-** మండలం కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో దేవరాపల్లి ప్రీమియం లీగ్ పేరుతో నిర్వహించిన క్రికెట్ టోర్నీ పోటీలు సోమవారం ముగిసాయి. పోటీల్లో ఆరు జట్లు పాల్గొనగా ఫైనల్ కు నాని,నరేష్ చేరుకున్నాయి ఇరు జట్లు మధ్య క్రికెట్ పోటీ ఉత్కంఠ గా సాగింది ఫైనల్ విజేతగా నాని జట్టు విజయం సాధించింది నరేష్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది గెలిచిన విజేతలకు మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు గొల్లు రామ్మూర్తి ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు.

# క్రీడా సమాచారమ్

## వైభవ్‌కు ప్రధాని మోదీ ప్రశంస



**పట్నా:** టీనేజ్ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ పై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల జల్లు కురిపించాడు. "ఐపీఎల్‌లో బిహార్ బిడ్డ వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శన చూశా. చిన్న వయసులో గొప్ప రికార్డు నెలకొల్పాడు. వైభవ్ ప్రదర్శన వెనుక ఎంతో శ్రమ ఉంది" అని మోదీ అన్నారు. బిహార్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆయన మాట్లాడుతూ.. వైభవ్‌ను కొనియాడారు. క్రీడాకారులు ఎంత ఎక్కువగా ఆడితే అంత బాగా మెరుగుపడతారని ప్రధాని అన్నారు. 14 ఏళ్ల వైభవ్ (రాజస్థాన్ రాయల్స్) గుజరాత్‌పై 35 బంతుల్లోనే సెంచరీ చేసి సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే.

వైభవ్‌ను జాగ్రత్తగా కాపాడండి.. ఛాపెల్: రాజస్థాన్ యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీని జాగ్రత్తగా కాపాడాలని బీసీసీఐకి, ఐపీఎల్ ఫ్రాంచైజీలకు, మీడియాకు ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ గ్రెగ్ ఛాపెల్ సూచించాడు. అతడిని సచిన్ తెందుల్కర్‌లా తయారు చేయాలని.. వినోద్ కాంబ్లి, పృథ్వీ షా మాదిరిగా కానీయొద్దని ఛాపెల్ అన్నాడు. "సచిన్ కుర్రాడిగా ఉన్నప్పుడు కేవలం ప్రతిభతోనే విజయవంతం కాలేదు. బలమైన మద్దతు వ్యవస్థ, క్రమశిక్షణ, తెలివైన కోచ్, మంచి కుటుంబం సచిన్‌ను గందరగోళం నుంచి కాపాడాయి. అదే సమయంలో అంతే ప్రతిభావంతుడు, బహుశా ఇంకాస్త మెరుగైన బ్యాటర్ కాంబ్లి పేరు, క్రమశిక్షణను సమతుల్యం చేసుకోలేక ఇబ్బందిపడ్డాడు. అతని ఎదుగుదల మాదిరే పతనం కూడా నాటకీయంగానే సాగింది. మరో అద్భుత ప్రతిభావంతుడు పృథ్వీ షా గాడితప్పాడు. వైభవ్‌ను బీసీసీఐ, ఫ్రాంచైజీలు, మెంటార్లు, మీడియా జాగ్రత్తగా కాపాడాలి. అతి ప్రచారం, మార్కెటింగ్ చేయడకుండా చక్కగా సానబెట్టాలి" అని ఛాపెల్ పేర్కొన్నాడు.

## ఒక్క పరుగు తేడాతో రాజస్థాన్‌పై కోల్‌కతా విజయం




ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను ఓడించింది. రసెల్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో మెరుగైన స్కోరు సాధించిన కోల్‌కతా.. వరుణ్, మొయిన్ అలీ, రాణా బంతితో రాణించడంతో ప్రత్యర్థిని కట్టడి చేసింది.

కేకేఆర్ నిలిచింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో రాజస్థాన్‌ను ఓడించింది. రసెల్ విధ్వంసక ఇన్నింగ్స్‌తో మెరుగైన స్కోరు సాధించిన కోల్‌కతా.. వరుణ్, మొయిన్ అలీ, రాణా బంతితో రాణించడంతో ప్రత్యర్థిని కట్టడి చేసింది. పాపం రాజస్థాన్! గెలుపు అవకాశాలు సృష్టించుకున్నప్పటికీ ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. కేవలం ఒక్క పరుగు తేడాతో రాయల్స్ ఓడింది. రియాన్ పరాగ్ అద్భుత ఇన్నింగ్స్ వృథా అయింది. 11 మ్యాచ్‌ల్లో కోల్‌కతాకు ఇది అయిదో విజయం. ఇంతకుముందే ప్లేఆఫ్స్‌కు దూరమైన రాజస్థాన్.. తొమ్మిదో ఓటమిని చవిచూసింది.

రసవత్తర పోరులో కోల్‌కతాదే పైచేయి. ఆదివారం ఆ జట్టు ఒక్క పరుగు తేడాతో రాజస్థాన్ రాయల్స్ )పై విజయం సాధించింది. రసెల్ (57 నాటౌట్‌బీ 25 బంతుల్లో 4x4, 6x6) విధ్వంసంతో మొదట కోల్‌కతా 4 వికెట్ల నష్టానికి 206 పరుగులు చేసింది. రఘువంశీ (44 31 బంతుల్లో 5x4), గుర్బాజ్ (35బీ 25 బంతుల్లో 4x4, 1x6), రహానె (30బీ 24 బంతుల్లో 1x4, 2x6) రాణించారు. ఛేదనలో రియాన్ పరాగ్ (95బీ 45 బంతుల్లో 6x4, 8x6) గొప్ప ఇన్నింగ్స్ ఆడినా రాయల్స్‌కు ఓటమి తప్పలేదు. ఆ జట్టు 8 వికెట్లకు 205 పరుగులు చేసింది. వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా, మొయిన్ అలీ రెండేసి వికెట్లు పడగొట్టారు.

## మేం స్వేచ్ఛగా ఆడాల్సిన సమయమిదే: కరుణ్ నాయర్



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్‌లో ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్, దిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. నాకౌట్ దశకు చేరుకోవాలంటే ఈ మ్యాచ్ ఇరు జట్లకూ అత్యంత కీలకం. ఎస్‌ఆర్‌హెచ్ కంటే దిల్లీకే ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో దిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలో కొనసాగుతోంది. పది మ్యాచుల్లో ఐదు విజయాలు నమోదు చేసిన దిల్లీ.. ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే మిగిలిన నాలుగింట్లో కనీసం రెండు మ్యాచుల్లో గెలవాలి. ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో దిల్లీ తలపడనుంది. ఈ క్రమంలో తమ గేమ్ ప్లాన్‌పై దిల్లీ బ్యాటర్ కరుణ్ నాయర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. నిర్భయంగా, స్వేచ్ఛగా ఆడేసే సమయం ఆసన్నమైందని పేర్కొన్నాడు.

"మాకు ప్రతి మ్యాచ్ విజయం కీలకం. జట్టులో జోష్ తెప్పించాల్సిన అవసరం ఉంది. ఈ సీజన్‌లో అన్ని మ్యాచుల్లో విజయం సాధించేందుకు తీవ్రంగా శ్రమించాం. ప్రస్తుతం ఈ స్థానంలో ఉన్నాం. ముందు మ్యాచుల్లో మరింత స్వేచ్ఛగా ఆడేందుకు ప్రయత్నిస్తాం. మేం కుదురుకునేందుకు మాకు తగినంత సమయం దొరికింది. కీలక సమయంలో దూకుడుగా ఆడాల్సిన అవసరం ఉంది. నేను ఇప్పటికీ బాగానే బ్యాటింగ్ చేస్తున్నా. అయితే, 20 పరుగులను పెద్ద స్కోర్లుగా మలచాలి. ఒక్కోసారి ఆ 20 పరుగులే ప్రభావం చూపించే అవకాశం లేకపోలేదు" అని కరుణ్ నాయర్ వెల్లడించాడు.

**స్మరన్ స్థానంలో హర్ష్ దూబె**

సన్‌రైజర్స్ హైదరాబాద్ కు ప్లేఆఫ్స్ అవకాశాలు తక్కువే కానీ.. ప్రతి మ్యాచ్‌లో గెలవాల్సిందే. ఈ క్రమంలో ఎస్‌ఆర్‌హెచ్ ఆటగాడు స్మరన్ రవిచంద్రన్ గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలిగాడు. అతడికి బదులు దేశవాళీ స్టార్ హర్ష్ దూబెను సన్‌రైజర్స్ తీసుకుంది. రూ. 30 లక్షల ప్రాథమిక ధరకే సన్‌రైజర్స్ జట్టుతో హర్ష్ చేరనున్నాడు. 22 ఏళ్ల హర్ష్ దూబె దేశవాళీలో 16 టీ20లు ఆడి 9 వికెట్లు పడగొట్టాడు.

## మిస్ వరల్డ్ పోటీలను విజయవంతం చేద్దాం: మంచు లక్ష్మి




ప్రపంచ సుందరి పోటీలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. సుమారు మూడు వారాలపాటు నిర్వహించే ఈ పోటీల్లో 120 దేశాలకు చెందిన అందాల భామలు సందడి చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న గచ్చిబౌలి స్టేడియంలో పోటీలు ప్రారంభం కానున్నాయి. మే 31న ఫైనల్ జరగనుంది. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, పోటీల్లో పాల్గొనే వారికి ఆల్ ది బెస్ట్ చెబుతూ సినీనటి మంచు లక్ష్మీ ఓ వీడియోను విడుదల చేశారు.

## బాలీవుడ్‌కి మీనాక్షి?



'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో ఈ ఏడాది ప్రారంభంలో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకుంది అందాల తార మీనాక్షి చౌదరి వరుస సినిమాలతో తెలుగు ప్రేక్షకులను మురిపిస్తోన్న ఈ భామ.. ఇప్పుడు బాలీవుడ్‌లో తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. 'స్త్రీ', 'మిమీ' లాంటి హిట్ చిత్రాలను నిర్మించిన దినేశ్ విజన్ రూపొందిస్తున్న ఓ ప్రాజెక్టులో మీనాక్షి ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. "దక్షిణాదిలో జోరు చూపిస్తున్న మీనాక్షి కోసం నిర్మాణ సంస్థ మడాక్ ఫిల్మ్స్ ప్రత్యేకంగా కథను సిద్ధం చేస్తుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాలో ఆమె పాత్ర శక్తిమంతంగా ఉండనుంది. మీనాక్షి స్క్రీన్ ప్రెజెన్స్, నటనా సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని చిత్రబృందం తనకు సరిగ్గా సరిపోయే హీరోను వెతికే పనిలో పడింది. మరికొన్ని రోజుల్లో ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించనున్నార"ని మీనాక్షి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## ప్రజల అర్జీలను నిర్ణీత సమయంలో పరిష్కరించండి

### నగర మేయర్ పీలా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలోని స్వీకరించిన ఆర్జీలను / ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన సందర్భంగా జీవీఎంసీ అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి ఇతర ఉన్నతాధికారులు మేయర్ కు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాన్ని అందించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మేయర్ తో కలసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి నిర్వహించారు.

ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను నిర్వహించాలన్న ఆదేశాల మేరకు జీవీఎంసీలో ప్రతి సోమవారం అధికారులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించడం జరుగుతుందని, ప్రజల నుండి వచ్చిన ప్రతి అర్జీను/ ఫిర్యాదును క్షుణ్ణంగా అధికారులు పరిశీలించి ప్రజల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవిఎంసి ప్రధాన కార్యాలయంలో, అన్ని జోనల్ కార్యాలయాల్లో స్వీకరించిన అర్జీలలో ఎటువంటి అలసత్వం వహించరాదని, పి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో ప్రజా సమస్యల కు పరిష్కారం లభించడం లేదనే ఫిర్యాదులు ప్రజల నుండి రాకుండా అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించాలని మేయర్ అధికారులకు ఆదేశించారు. అనంతరం ప్రజల నుండి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా అదనపు కమీషనరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 300 అర్జీలు/ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా 2వ జోన్ కు 17, 3వ జోన్ కు 20, 4వ జోన్ కు 15, 5వ జోన్ కు 06, 6వ జోనుకు 09, 8వ జోన్ కు 227, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 06 ఫిర్యాదులు అందాయని తెలిపారు. అలాగే జివిఎంసి అడ్మినిస్ట్రేషన్, అకౌంట్సు విభాగమునకు 220, రెవెన్యూ విభాగమునకు 08, పట్టణ ప్రణాళిక విభాగమునకు 48, ఇంజినీరింగు విభాగమునకు 16, మొక్కల విభాగమునకు 01, యుసిడి విభాగమునకు 07 కలిపి మొత్తంగా 300 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు.

అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనరు మాట్లాడుతూ ఈ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను ప్రతి రోజు పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరు పి.శివప్రసాదరాజు, చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకారరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి,డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, పర్యవేక్షక ఇంజనీర్లు కేవిఎన్ రవి, సంపత్ కుమార్, కృష్ణారావు, గోవిందరావు, యు సి డి, పి.ఒ-డి.లక్ష్మి, డిపిఓలు ఎం.వీ.డి ఫణి రామ్, ఎల్.సురేష్, విజయశంకర్, సివిఒ డా.ఎన్.కిషోర్, బయాలజిస్ట్ సాంబమూర్తి, స్పోర్ట్స్ డైరెక్టర్ రాజు, ఆర్.ఎఫ్.ఒ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగుల నాగఫణిశర్మకు సత్కారం





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** బృహత్ ద్విసహస్రావధాని, మహాకవి, బ్రహ్మశ్రీ డా. మాడుగుల నాగఫణి శర్మ గురువు గారు భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారమును స్వీకరించిన సందర్భంగా చైతన్య గ్రూప్ స్థాపకులు మరియు చైర్మన్ శ్రీ కలిదిండి వీర వెంకట సత్యనారాయణరాజు గారి ఆధ్వర్యంలో కిమ్స్ మెడికల్ కాలేజ్ ప్రాంగణం, అమలాపురంలో గురువుగారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరము గురువుగారు భక్తులను, నిర్వాహకులను ఆశీర్వదిస్తూ మహాభారతము, భాగవతములోని అనేకమైన కీలక ఘట్టములను ప్రవచనము రూపంలో భక్తులకు తెలియజేసారు.

## కలెక్టర్ దృష్టికి దివ్యాంగుల సమస్యలు





**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అక్కిరెడ్డి అప్పారావు ఆధ్వర్యంలో విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సోదరులు, సోదరీమణులకు సమస్య మీద 15వేలు పెన్షన్, డీఎం & హెచ్ఓ, ఇళ్లకోసం గ్రౌండ్ ఫ్లోర్ మంజూరు చేయమని కలెక్టర్‌తో మాట్లాడడం జరిగింది. మన రాష్ట్ర జాతీయ అధ్యక్షులు మారేడుపూడి రమేష్ బాబు, తొత్తరమూడి శ్రీనివాస్, పైడిశెట్టి, కొండలరావు, గురుమూర్తి, కత్తి రవి, అన్నిజోన్ల దివ్యాంగుల సోదరులు, సోదరీమణులు సుమారుగా 50 మంది వరకు వచ్చి కలెక్టర్‌తో కలిసి తమ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి హామీ ఇవ్వడం జరిగింది.

## వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- సమాచారానికి టోల్ ఫ్రీ నంబర్ 18004256826
- జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

**పాడేరు, (విశాఖ సమాచారమ్):-** రానున్న నాలుగు రోజుల పాటు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా ప్రధాన కేంద్రం పాడేరు కలెక్టరేట్ లో 24 గంటలు పని చేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఈ నెల ఐదవ తేదీన పిడుగులతో కూడిన మధ్యస్తం నుండి భారీ వర్షాలు పడే అవకాశముందని అదే విధంగా గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వేచే అవకాశం ఉందన్నారు, 6,7,8 తేదీలలో అల్పం నుండి మధ్యస్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తన ఉండాలని కలెక్టర్ విజ్ఞాప్తి చేసారు. అదేవిధంగా అన్ని శాఖల అధికారులు వారి వారి ప్రధాన కేంద్రాలలో అందుబాటులో ఉండి విపత్తు సంభవిస్తే ఎదుర్కొనేందుకు ప్రజాలకు సహాయ సహాకారాలు అందించడానికి సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అదే విధంగా కలెక్టరేట్ లో 24 గంటలూ పనిచేసే విధంగా టోల్ ఫ్రీ నంబర్ 18004256826 తో కంట్రోల్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ విధులు నిర్వర్తించడానికి కలెక్టరేట్ సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించడం జరిగిందని వివరించారు. కంట్రోల్ రూమ్ సిబ్బంది పర్యవేక్షణకు తహసిల్దార్ స్థాయి అధికారులను కూడా కేటాయించడం జరిగిందన్నారు. ఎటువంటి అవాంచనీయ సంఘటలు జరిగినా టోల్ ఫ్రీ నంబర్ 18004256826 కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com